## ఆప్ ప్రజాదరణకు గండికొట్టేలా బిజెపి యత్నాలు

## సిఎం అభ్యర్థిని ప్రకటించడంలో పార్టీల వైఫల్యం

న్యూఢిల్లీ, జనవరి21 : ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రజల ముందు ఉంచలేని పరిస్థితుల్లో ఢిల్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ అధికార పార్టీకి ఎదురులేని నాయకుడైనప్పటికీ చట్టపరమైన చిక్కుల కారణంగా వారు ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పలేకపోతున్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ దేశ రాజధానిలో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడానికి ప్రజాదరణ పొందిన లేదా బలమైన నాయకుడే లేరు. స్థానిక నాయకత్వం లేకపోవడంతో, వారు ఓటర్లను ఆకర్షించడానికి బయటి నుండి 'దిగుమతి చేసుకున్న' నాయకులు లేదా తమ హైకమాండ్‌లపై ఆధారపడుతున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందుగానే తన అభ్యర్థులందరినీ ప్రకటించడం ద్వారా ఆప్ సౌకర్యవంతమైన స్థితిలో ఉండగా, అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ చివరి వరకు తికమకపడుతున్నాయి. అంతర్గత కలహాలు, బలమైన అభ్యర్థులను గుర్తించడంలో అనిశ్చితి వారి ఎంపికలను కష్టతరం చేశాయి. మొదట్లో, బిజెపి మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని సిఎం అభ్యర్థి కాబోతున్నట్లు ప్రచారం జరిగింది.



### మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా

2వ పేజీలో...

# ఢిల్లీ ఎన్నికలు



### ట్రంప్ దూకుడు నిర్ణయాలు

## 1600 మందికి

# ట్రంప్ క్షమాభిక్ష

### పలు అంశాలపై కీలక ఆదేశాలు

### దస్త్రాలపై వెనువెంటనే సంతకాలు

వాషింగ్టన్, జనవరి21: రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పారిస్ ఒప్పందం నుంచి బయటకు రావడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగడం, దేశంలో వాక్ స్వాంతంత్యంరపై ఉన్న సెన్సార్ తొలగింపు, కొన్ని రోజులపాటు అధికారులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండా ఉత్వర్వులు జారీ చేశారు. జో బైడెన్ ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 78 నిర్ణయాలను రద్దుచేస్తూ డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీ చేశారు. చైనా నుంచి పనామా కాలువను తిరిగి చేజిక్కుంచుకుంటామని స్పష్టం చేశారు.

3వ పేజీలో...



2వ పేజీలో...

### యువత జీవితాలతో ఆడుకుంటున్న

# బిజెపి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు

ఘాటు విమర్శలు చేసిన రాహుల్



### దావోస్‌లో తెలంగాణ

# పెట్టుబడుల వేట

కామారెడ్డిలో పామాయిల్ యూనిట్ ఏర్పాటు

తెలంగాణ ప్రభుత్వంతో యూనిలీవర్ ఒప్పందం

2వ పేజీలో...



### టర్కీ అగ్నిప్రమాదం..

### 66కు పెరిగిన

### మృతుల సంఖ్య

ట్విటర్ వేదికగా కేటీఆర్



కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు..

## వంచన రాజ్యం

3వ పేజీలో...



-స్టంట్ వేసిన డాక్టర్లు..

ప్రమాదం లేదని ప్రకటన

డెహ్రాడూన్ పర్యటనలో

### పద్మారావుకు గుండెపోటు

### అమరావతిలో

# సీఐఐ కేంద్రం ఏర్పాటు

## చంద్రబాబు



దావోస్, జనవరి 21: టాటా సంస్థతో కలిసి అమరావతిలో సీఐఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు కోసం ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దావోస్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇక ఈ పర్యటనలో సీఐఐ కేంద్రం ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన లక్ష్యంగా సీఐఐ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. శిక్షణ, సలహా సేవలతో పరిశ్రమల్లో పోటీతత్వం నెలకొల్పుతామన్నారు. భారత్ 2047 విజన్ మేరకు ముందుకు సాగుతామన్నారు.

-ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

-అధికారులతో సమీక్షలో సిఎస్ శాంతికుమారి



### పక్కాగా తెలంగాణ

## భూ భారతి అమలు

### ఢిల్లీలో ఉచిత విద్య

-మరో హామితో ముందుకు వచ్చిన

## బిజెపి

2వ పేజీలో...

వచ్చింది. ఎన్నికల తర్వాత, ఆమె ప్రజాజీవితంలో ఎక్కడా కనిపించ లేదు. అరవింద్ కేజ్రీవాల్ అధికార ఆప్‌కి కిరీటం లేని నాయకుడు కావడంతో సాధారణంగా అందరూ ఆ పార్టీ ముఖ్యమంత్రిగా భావిస్తున్నప్పటికీ ఆయన చట్టపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన అధికారిక ఫైళ్లపై సంతకం చేయలేరు లేదా సిఎం కార్యాలయంలోకి ప్రవేశింపలేరు.దానితో ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆప్ చెప్పలేకపోతున్నది. దానితో బిజెపి మార్గంలో ఆప్ కేజ్రీవాల్, సిఎం అతిశీ అనే డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రస్తావిస్తున్నారు. కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలను 'ద్వేషిస్తున్నాడని' ఆరోపించడంపై దృష్టి సారించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి తీసుకువచ్చిన నమోదిత ఓటర్లలో అకస్మాత్తుగా, వివరించలేని పెరుగుదల ఉందని ఆప్ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడాన్ని వారు ఈ విధంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక దుష్ప్రచారంతో ఆప్‌ను ఆత్మరక్షణలో పడవేసి ప్రయత్నం కాకుండా నేరుగా ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా బిజెపి ప్రచారం చేయలేకపోతున్నారు. చివరకు ప్రధాన మంత్రి సైతం వ్యక్తిగత విమర్శలతో కేజ్రీవాల్ ప్రభావం ప్రజలపై తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల్లో విజయం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్ పార్టీలు వోటర్లను ఆకర్షించేందుకు హామీలను గుప్పిస్తున్నాయి. ఇప్పటికు మేనిఫెస్టోను ప్రకటించిన బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య సౌకర్యం కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. పాలిటెక్నిక్‌ర ఐటిఐలలో టెక్నికల్ కోర్సులు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) విద్యార్థులకు భీమ్ రావ్ అంబేద్కర్ స్టైపెండ్ పథకం కింద ప్రతి నెల రూ. 1000 వంతున ఉపకార వేతనాలు అందజేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. యుపిఎస్‌సి, రాష్ట్ర సివిల్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పార్టీ ప్రకటించింది. ఒక ఆటో ట్యాక్సీ డ్రైవర్ సంక్షేమ మండలిని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన బిజెపి డ్రైవర్లకు రూ. 10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. అదే విధంగా ఇళ్లలో పని చేసే కార్మికుల కోసం సంక్షేమ మండలి ఏర్పాటుకు, అవే బీమా సౌకర్యాల కల్పనకు పార్టీ వాగ్దానం చేసింది. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నేత అనురాగ్ ఠాకూర్ ఈ మేరకు బిజెపి సంకల్ప్ పత్ర పార్ట్ 2ను విడుదల చేశారు. ఆప్ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాలు, అవినీతిపై సిట్ ఏర్పాటు చేస్తామని అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు. ఢిల్లీలో జల్ జీవన్ మిషన్ అమలులో విఫలమైనందుకు ఆప్ ప్రభుత్వాన్ని ... అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రతి విద్యార్థికీ ఉచిత విద్య అభిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కేజ్రీవాల్ కోరారు.

## కాశ్మీర్ ఎదురు కాల్పుల్లో జవాన్ మృతి

### సంతాపం ప్రకటించిన సిఎం చంద్రబాబు

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి : జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన జవాన్ కార్తీక్ మృతి చెందాడు. ఈ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ కార్తీక్ సంతాపం ప్రకటిస్తూ.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నానని చంద్రబాబు ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన జవాన్ కార్తీక్ మృతి కావడం బాధాకరమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. దేశ రక్షణ కోసం అమరుడైన జవాన్ చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని, ఆయన కుటుంబానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం పరంగా అండగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగింపు

**అధికారులను ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు**

**బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు**

నల్లగొండ, యదార్థవాది ప్రతినిధి, జనవరి21 : నల్లగొండలో కేటీఆర్ రైతు మహాధర్నా ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. రైతు ధర్నాకు పోలీసులు అనుమతించలేదు. అయితే అప్పటికే నల్లగొడ పట్టణంలో ధర్నాకు సంభందించి ఫెక్సీని బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేశారు. కాగా, అర్ధరాత్రి వాటిని తొలగిస్తుండగా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించారు. అయినప్పటికి అధికారులు ఫ్లెక్సీని తొలగించారు. కాంగ్రెస్ చెత్త రాజకీయాన్ని ప్రశ్నించేందుకు మున్సిపల్ ఆఫీసుకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చేరుకున్నారు. అయినప్పటికి మున్సిపల్ కమిషనర్ స్పందించలేదు. మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల వ్యవహరిస్తుండటంతో కమిషనర్ ఛాంబర్ లోనే పార్టీ కౌన్సిలర్లు, నేతల్తో కలిసి భూపాల్ రెడ్డి బైఠాయించారు. కాగా, మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఆందోళనలో హైడ్రామా చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్యాలయంలోకి కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి రంగ ప్రవేశం చేశారు. బీఆర్ఎస్ నేతలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. పూల కుండీలు విసురుతూ దాడికి యత్నించారు. కాంగ్రెస్ నేతల దౌర్జన్యంపై పోలీసులు చూస్తూ ఉండి పోయారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మాజీ ఎమ్మెల్యే కంచర్లతో సహా బీఆర్ఎస్ నేతలను బలవంతంగా అరెస్ట్ చేశారు. పోలీసులతో తీవ్ర తోపులాటలో భూపాల్‌రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు. అనంతరం నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే దాడికి పాల్పడిన కాంగ్రెస్ నేతలు మున్సిపాలిటీ కార్యాలయంలోనే ఉండటం గమనార్హం.

# ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

**ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతి**

**చలపతి సహా పలువురు అగ్రనేతలను మట్టుబెట్టిన బలగాలు**

**నక్సల్స్ లేని భారత్ దిశగా అడుగులు అంటూ అమిత్ షా ట్వీట్**



రాయపూర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి21 : ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ప్రధాన మావోయిస్టులు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. చిత్తూరు జిల్లావాసి అయిన చలపతిపై ప్రభుత్వం గతంలో రూ.కోటి రివార్డు ప్రకటించింది. దీంతో జనవరి 19 రాత్రి నుంచి పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 16కు చేరిందని పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిన్న ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. తెల్లవారుజామున జరిపిన గాలింపులో మరో 14 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే భారీస్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇందులో వెయ్యి మంది వరకు భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ ఎన్ కౌంటర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని ఆయన తెలిపారు. ఈ ఎన్ కౌంటర్ నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ లాంటిదన్నారు. మన భద్రతా బలగాలకు ఇదో గొప్ప విజయం అని అమిత్ షా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో నక్సలిజం చివరి దశలో ఉందని ఎద్దేవా చేశారు. సీఆర్‌పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని షా చెప్పారు. అయితే, ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19వ తేదీ రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ కొనసాగుతుంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 16 మంది మావోలు మరణించగా.. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారని అమిత్ షా పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న బలగాలపై ప్రశంసలు జల్లు కురుపించారు. మన భద్రతాదళాలకు ఇది గొప్ప విజయమని, నక్సల్స్ రహిత భారత్ దిశగా ఇది కీలక అడుగు అని కొనియాడారు. ఈ ఎన్ కౌంటర్ కేంద్ర కమిటీ సభ్యులు మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డూ, ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు.

# దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి...**

హైదరాబాద్,జనవరి 21 : కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్‌లో జరిగిన సమావేశంలో సిఎంరేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ,అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

# టర్కీ అగ్నిప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి...**

టర్కీ : టర్కీ లోని స్కీ రిసార్టు హెూటల్ అగ్నిప్రమాదం లో మృతుల సంఖ్య 66కు పెరిగింది. క్షతగాత్రుల సంఖ్య 51కి చేరింది. బోలో ప్రావిన్స్‌లోని గ్రాండ్ కర్తాల్ హెూటల్‌లో ఈ ప్రమాదం జరిగింది. 12 అంతస్తులు ఉన్న ఆ హెూటల్‌లో తెల్లవారుజామున 3.30 గంటలకు అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో హెూటల్లో కస్టమర్లు కొందరు బెడ్ షీట్లు, బ్లాంకెట్ల సాయంతో రూమ్‌ల నుంచి కిందకు వచ్చే ప్రయత్నంచేశారు. ప్రమాదం జరిగినప్పుడు 234 మంది గెస్టులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అందరూ నిద్రలో ఉన్నప్పుడు నిప్పు అంటుకున్నదని, వెంటనే బయటకు పరుగులు తీశామని ఓ స్కీయింగ్ ఇన్‌స్ట్రక్టర్ తెలిపారు. హెూటల్ గదుల్లో పొగ కమ్ముకుపోవడంతో గెస్టులు ఫైర్ ఎస్కేప్‌ను గుర్తించడం కష్టంగా మారిందన్నారు. హెూటల్‌కు చెందిన రూఫ్‌తోపాటు టాప్ ఫ్లోర్లు కూడా అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. గ్రాండ్ కర్తాల్ హెూటల్‌లో మొత్తం 161 రూమ్‌లు ఉన్నాయి. దేశ రాజధాని ఇస్తాంబుల్‌కు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొరొగ్లు పర్వతాల్లో స్కీ రిసార్టు ఉన్నది. కాగా స్కూళ్లకు సెమిస్టర్ సెలువులు ఇవ్వడంతో రిసార్టులన్నీ పూర్తిగా గెస్టులతో నిండిపోయాయి. ప్రమాదం జరిగిన హెూటల్ వద్దకు 30 ఫైర్ ట్రక్కులు, 28 అంబులెన్సులను పంపారు.

## బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

**నగర మేయర్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం**

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో నగర ఎమ్మెల్యేలు దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే.. జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. లా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మీపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. రోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది.

# యువత జీవితాలతో ఆడుకుంటున్న బిజెపి

**మొదటిపేజీ తరువాయి...**

న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : భాజపా పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు నమోదవుతున్నాయని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. పేపర్ లీక్‌లను యువత హక్కులను కాలరాసే ఆయుధంగా కాషాయ పార్టీ మార్చుకుందని ఆరోపించారు. 'భాజపా పాలిత రాష్ట్రాల్లో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరసనలు చేపట్టిన బీపీఎస్‌సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. అభ్యర్థులను కలిసినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పేపర్ లీక్ అయితే.. కచ్చితంగా అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడికి యత్నించారు. బాధితులపై కేసులు పెట్టారు' అని రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో వీడియో పోస్టు పెట్టారు. '28 పరీక్షా కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగినా ప్రభుత్వం ఇంకా అంగీకరించేందుకు సిద్ధంగా లేదు. ఇది కేవలం బిహార్‌కు సంబంధించిన సమస్య కాదు. యావత్ దేశానికి చెందిన సమస్య. అభ్యర్థుల నిరసనల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం' అని హామీ ఇచ్చారు. కాగా.. గతేడాది డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

**మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో ఘటన**

మహబూబ్‌నగర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి21 : వైద్యం కోసం వెళ్లిన ఓ మహిళపై ఓ నర్సు దాష్టీకం ప్రదర్శించింది. ఇష్టమొచ్చినట్లు తిడుతూ చేయి కూడా చేసుకుంది. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపం చెందిన సదరు మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. దామరగిద్ద మండలం కందేన్‌పల్లికి చెందిన నారమ్మ (32) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. అయితే రాత్రి సమయంలో విధుల్లో ఉన్న ఓ నర్సు నారమ్మపై దౌర్జన్యం ప్రదర్శించింది. ఆమెను ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా చేయి కూడా చేసుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి అని బాత్‌రూంలోకి వెళ్లింది. కానీ ఎంతసేపటికీ బయటకు రావడంతో బంధువులు తలుపులు బద్దలగొట్టి చూడగా ఉరేసుకుని నారమ్మ కనిపించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నర్సు దుర్భాషలాడుతూ చేయి చేసుకుందనే మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

తీసిపోనని చెప్పుకుంది. కానీ ఏ ఒక్కరూ ఢిల్లీ కాలుష్యంపై మాట్లాడడంలేదు. కేవలం ఉచిత పథకాలకే పరిమితం కావడం గమనార్హం. అయితే దేశరాజధాని కావడంతో మోడీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకం గా తీసుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ముక్కోణపు పోటీ జరుగుతోంది. ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంటూ వస్తున్న బిజెపి ఈసారి ఎట్లాగైనా అధికారం చేపట్టాలని పట్టుదలగా ఉంది. పదేళ్ల ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రభుత్వ వ్యతిరేకత అందుకు అనుకూలం కాగలదని ఆశిస్తున్నది. మొహల్లా క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో కొంతమేరకు కేజీ్రవాల్ దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి సాధింపలేని పాలనా విజయాలు సాధించినా గెలుపుకోసం అవి మాత్రమే సరిపోవు. ప్రపంచం లోనే అత్యంత కాలుష్యమైన, అపరిశుభ్రమైన దేశరాజధానిగా నేడు ఢిల్లీ అప్రతిష్ఠకు గురవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా అభివృద్ధి చెందినా ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయంగా భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటుచూసినా కనిపించే వ్యర్థపదార్థాలు, ఇవికాకుండా కాలుష్యానికి కారనం అవుతున్నాయి. ఇవన్నీ కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, వైఫల్యాలు ప్రజల ముందు నిలుస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజీ్రవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులు అనేకమంది వెళ్లడం కూడా ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఆ కేసులు అన్ని రాజకీయ కక్షసాధింపుగా నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు ఏవీ న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు లేకపోయినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెనుసవాల్‌ను ఇప్పుడు ఆయన ఎదుర్కొంటున్నారు. మరోవంక బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడంతో 2014 నుండి వరుసగా మొత్తం 7 లోక్‌సభ సీట్లను గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతుంది. కానీ ఆప్ మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో మొదటిసారిగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. 'శేష్ మహల్' గురించి కొంతమేరకు కేజీ్రవాల్‌ను ఇరకాటంలో పడవేసిన బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి అద్భుతమైన ప్రచారాలు వివరాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బిజెపి తమ ప్రచారాన్ని మార్చివేశారు.అంతేగాని, ఢిల్లీ రూపురేఖల ను తాము ఏ విధంగా మార్చగలమో చెప్పే ప్రయత్నం చేయడం లేదు.గతంలో యుపిఎ హయాంలో ఢిల్లీకి ఇతర రాష్ట్రాల మాదిరిగా పూర్తి రాష్ట్రస్థాయి అధికారాలు ఇవ్వాలని ఆందోళనలు జరిపిన బిజెపి గత పదేళ్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారాలను గణనీయంగా తగ్గించి వేసింది. పేరుకు రాష్ట్ర ప్రభుత్వమే అయినప్పటికీ ఓ మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఢిల్లీ ప్రభుత్వాన్ని కేంద్రంలోని బిజెపి మార్చివేసింది. మరోవంక జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని స్వయంగా ప్రధాని మోడీ హామీ ఇచ్చి ఏళ్ళుగడుస్తున్నా ఆ దిశలో ఎటువంటి చర్యలకు పాల్పడటం లేదు. దానితో ఢిల్లీ ప్రభుత్వంలో గణనీయ మార్పులను తీసుకురాగలమనే భరోసాను ప్రజలలో బిజెపి కలిగించలేకపోతున్నది. ఢిల్లీ తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న సమయంలో పొరుగున ఉన్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేకపోయింది. ఢిల్లీలోని దళితుల మద్దతు పొందటం బిజెపికి ఓ సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి కేజీ్రవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ బిజెపిలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు బిజెపి వెనకాడు తుంది. పైగా పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే గెలుపొంది, ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, ప్రజాదరణతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తున్న బిజెపి ఢిల్లీలో సైతం కేవలం ప్రధాని మోడీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతుంది. అయితే గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ఓటర్లను ఆకర్షించడంతో మోడీకి సైతం పరిమితులున్నాయని స్పష్టం కావడం బిజెపికి ప్రమాద సంకేతాలను సూచిస్తున్నది. ముఖ్యంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం వంటి అంశాలు బిజెపి నుండి యువతను, మధ్యతరగతి ప్రజలను దూరం చేస్తుంది. అందుకనే ఢిల్లీ ఎన్నికలు బిజెపి నాయకత్వంపై అగ్నిపరీక్షగా మారాయి. ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజీ్రవాల్, అఖిలేష్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుంది. బిజెపికి సైతం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కాకుండా మరో నాయకుడు మోడీకి పోటీగా ఎదగడం ఇష్టం లేదు. అందుకనే కేజీ్రవాల్‌ను ఓడించడం ఆ పార్టీకి చాలా అవసరంగా ఉంది. ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓ రకంగా ఏకాకిగా పోటీ చేస్తున్నది. ప్రతిపక్షాలు ఆప్ పట్ల సానుకూలత వ్యక్తం చేయడం రాబోయే రోజులలో జాతీయ స్థాయిలో ఆ పార్టీ మరింత ఏకాకిగా మారే సంకేతాలను అందిస్తున్నది.

ఎలాంటి ప్రాణప్రాయం లేదని డాక్టర్లు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన హైద్రాబాద్‌కు రానున్నారు. తమ అభిమాన నేతకు గుండె పోటు వచ్చిందని తెలియడంతో పద్మారావు గౌడ్ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురి అయ్యారు. పద్మారావు గౌడ్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండె పోటుకు గురయ్యారని తెలియడంతో బీఆర్ఎస్ నేతలు ఆయన ఇంటికి తరలి వెళ్తున్నారు. పద్మారావు గౌడ్ హెల్త్ కండిషన్?పై బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కలిక నిర్ణయాలతో ఒకటి. మెక్సికో గల్ఫ్‌ను అమెరికా గల్ఫ్‌గా పేరు మార్చే ప్రక్రియ ప్రారంభ మైంది. ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. చైనా ఉత్పత్తులపై ప్రస్తుతానికి మినహాయింపు ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, కెనడాలపై ఉక్కుపాదం మోపారు. ఫిబ్రవరి 1 నుంచి మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం పన్నులు విధిస్తూ ట్రంప్ ఉత్వర్వులు జారీ చేశారు. సరిహద్దులో అక్రమ వలసల్ని నివారించకపోతే తీవ్ర నిర్ణయాలు తీసుకుంటానని ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. గతంలో అమెరికాలో జన్మించే పిల్లలకు దేశ పౌరసత్వం లభించేది. ఈ చట్టాల్లో సవరణ తీసుకొస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. దేశంలోకి తల్లిదండ్రులు అక్రమంగా ప్రవేశిస్తే.. వారికి జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం ఇవ్వకూడదని ప్రకటించారు. ఇప్పటివరకూ దేశంలోకి అక్రమంగా వచ్చిన వారికి పుట్టిన సంతానానికి సైతం పౌరసత్వం లభించేలా ఉన్న అమెరికా చట్టాలలో ట్రంప్ ప్రభుత్వం మార్పులు తీసుకొస్తుంది. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ ఎన్నిక అనంతరం క్యాపిటల్ లో జరిగిన దాడి కేసులో ఇరుక్కున్న రిపబ్లికన్లకు ఊరట కల్పించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణం చేసన ట్రంప్ ఎన్నికల హామీ మేరకు 2021 జనవరి 6 నాటి దాడుల్లో పాల్గొన్న 1500 మందికి క్షమాభిక్ష కల్పిస్తూ, వారిపై పెండింగ్‌లో ఉన్న కేసులు కొట్టివేయాలని అటార్నీ జర్నల్‌ను ఆదేశించారు. బైడెన్ హయాంలో దేశంలో వాక్ స్వాతంత్యం÷-రపై కొంతమేర నియంత్రణ ఉండేది. చట్టప్రకారం హద్దు దాటి మాట్లాడేందుకు అవకాశం లేదు. తాజాగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ దేశంలో వాక్ స్వాతంత్యం÷-రపై సెన్సార్ తొలగిస్తూ సంతకం చేశారు. చైనా ఆధీనంలో ఉన్న పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. పరిపాలనలో తనకు పూర్తి నియంత్రణ వచ్చే వరకు అధికారులు సొంతంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండా ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు.

# పక్కాగా తెలంగాణ భూ భారతి అమలు

**మొదటిపేజీ తరువాయి...**



హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టంలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని సిఎస్ శాంతికుమారి అన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 పై మంగళవారం సచివాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 వివరించేందుకే ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూ భారతి చట్టం, 2025పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించడంతో పాటు జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని అన్నారు. ఈ చట్టం సమర్థవంత మైన వ్యవసాయ భూ పరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుండి వచ్చిన పలు సూచనలను స్వీకరించిన తరువాతే ఈ చట్టంను రూపొందించామని ఆయన తెలియజేశారు. శాసనసభ ఆమోదం పొందిన ఈ చట్టాన్ని గౌరవనీయులైన గవర్నర్ కూడా ఆమోదించడంతో ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడిందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025 ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు. సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, రాష్ట్ర వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయమైన,సరసమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం ఈ విధానం లక్ష్యం అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేష్ కుమార్, యోగితా రాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్, ఇతర అధికారులు వర్క్ షాప్‌కు హాజరయ్యారు.

# కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు.. వంచన రాజ్యం

**మొదటిపేజీ తరువాయి...**

**-రైతుల శాపనార్థాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది**
**ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు**

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి21 : ఇది రైతు రాజ్యం కాదని, రైతు వంచన రాజ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని మండిపడ్డారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్లలా ప్రాణంతీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలే అని అన్నారు. రుణమాఫీ చేయనందుకే ఈ ఆత్మహత్యలని అన్నారు. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయని చెప్పారు. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయని ఎక్స్ వేదికగా కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధానమైన కారణాలతోపాటు రాష్ట్రంలో ఏడాది నుంచి వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటుందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఆందోళనకర పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని దాటకపోవడం, రైతన్నలకు కొన్ని సంవత్సరాలుగా అందుతున్న రైతుబంధును ఆపి, ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసాను కూడా ఎత్తగొట్టడం వంటి ప్రధానమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించే విషయంలో సరారు పూర్తిగా చేతులెత్తేయడంతోనే రైతులు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దికులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరఫున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

# రాహుల్, ప్రియాంకలు శక్తి స్వరూపులు

**-కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**



బెంగళూరు, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శక్తి స్వారుపులగా కొనియాడారు. ప్రియాంక 'స్త్రీ శక్తి'కి, రాహుల్ గాంధీ 'యువ శక్తి'కి చిహ్నాలుగా పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావిలో నిర్వహించిన 'గాంధీ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఖర్గే ప్రసంగించారు. 'స్వాతంత్య్ర పోరాటయోధులు కిత్తూరు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మీ బాయ్‌తో ప్రియాంకను ప్రజలు పోల్చుకుంటున్నారు. ప్రియాంక స్త్రీ శక్తికి చిహ్నం. ఆమె ఎంతో దృఢమైన మహిళ. తన తండ్రి రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఆమె తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు. బెళగావి బిడ్డ కిత్తూరు రాణి చెన్నమ్మ గొప్ప మహిళ. ఆమె ప్రజల కోసం ఎంతో పోరాటం చేశారు. ప్రస్తుతం భాజపా, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రియాంక పోరాడుతున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. 'ప్రియాంక స్త్రీ శక్తికి.. రాహుల్ గాంధీ యువశక్తికి చిహ్నం. మేమంతా ప్రజల వెంటే ఉంటాం' అని అన్నారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు చేశారు. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గాంధీ కుటుంబమే లక్ష్యంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.



నిజామాబాద్ రూరల్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లోని గంగ పుత్ర సంఘములో బీసీ మహిళల చైతన్య వేదికను మంచికట్ల కల్పన అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీసీ అధ్యక్షురాలు వీణా రాణి మాట్లాడుతూ.... అన్నిరంగాలలో మహిళలు రానించాలని అన్నారు. రాజకీయంగా, అధికారికంగా ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలలో ఉన్నతమైన స్థానాల్లో నిలదొక్కుకునేలా బీసీ మహిళా సంక్షేమ సంఘం మహిళలు ఎప్పుడు ముందుంటారని అన్నారు. మనకు మనవే మన బలమని మహిళలందరు ఐకమత్యంతో ఏక దాటిపై ఉండాలని ఒకరికి ఒకరు విజయం వైపు ముందుకు వెళ్లాలని సూచించారు. ఇందులో భాగంగానే ప్రతీ గ్రామం, మండలాల్లో బీసీ మహిళా సంక్షేమ సంఘం లో మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఎలా పొందలో తెలుపుతూ. బీసీ మహిళా సంఘాల కమిటీలను ఏర్పాటు చేసారు. ఈ సందర్బంగా బీసీ మహిళా సంక్షేమ సంఘం నిజామాబాద్ డివిజన్ అధ్యక్షురాలు పుప్పాల గీత మాట్లాడుతూ... చైతన్య వంతులైన మహిళలు ప్రజా సేవలో అంకిత భావంతో మహిళా గొంతుకలను పార్లమెంట్ లో వినిపించాలని అన్నారు. ఈ మహిళలను చైతన్యం పరిచే అద్భుతమైన కార్యక్రమాలతో ప్రభుత్వ ఫలాలను పొందే అవకాశం ఉంటుందని వివిధ మండలాల్లో, వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మహిళా చైతన్య వేదికలో గళం విప్పారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి దేశొట్టి వనజ, ధర్పల్లి మండలం అధ్యక్షురాలు వంగ చంద్రకళ, ధర్పల్లి గ్రామం అధ్యక్షురాలు గౌరారం పావని, గౌరారం సువర్ణ, కె.లక్ష్మి,జి.లత,డి.లక్ష్మి, స్వప్న,డి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షులు రంగు ముత్యంరాజు స్వాతి దంపతుల కూతురు రంగు మణిదీప్తి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అల్పాహారం పంపిణి చేశారు. సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ కింద ఇట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ అన్ని ధనల కన్నా అన్నదానం మిన్న అని అన్నారు. అన్నదానం చేయడం మూలంగా అన్నపూర్ణ దేవి, అయ్యప్ప స్వామి అనుగ్రహం లభిస్తుందని అన్నారు. పుట్టినరోజు నా, పెళ్లిరోజునా సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా భావనతో పనిచేయాలని, నిరాశ్రయులను చేరా దీసి మనకు తోచిన సహాయం చేయాలనీ అప్పుడే దైవ అనుగ్రహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ జిల్లా నాయకులు, సుంకాని శ్రీనివాస్, మొరిశెట్టి సత్యనారాయణ, తన్నీరు వాసుదేవు, రాఘవ శెట్టి, సింగు జీవన్,వినాయక, శశి కుమార్, భద్రాచలం, యానాల సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే - ఐజేయు) డైరీని జిల్లా జడ్జి కుంచాల సునీత చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య మీడియా వారధిగా పని చేయాలని సూచించారు. అలాగే చట్టాలను ప్రజల్లోకి తీసుకు రావడంతో పాటు కొత్త చట్టాలపై అవగాహన కల్పించడంలోనూ ముందు ఉండాలని అన్నారు. జర్నలిస్టులు సైతం చట్టాలపై



అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గంజాయి, డ్రగ్స్,పోక్సో కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ చట్టాలను ప్రజా బాహుల్యంలోకి తీసుకు వస్తే సమాజానికి మేలు జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొబ్బిలి నర్సయ్య, యూనియన్ జిల్లా కోశాధికారి సిరిగాధ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాధరి సంజీవరెడ్డి, టి ఇ ఎం ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బైర శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు చతుర్వేధం, ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గోవిందరాజు, యూనియన్ రాష్ట్ర నాయకుడు అహ్మద్ అలీ ఖాన్, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ తోనే పార్టీలో ఉన్నత స్థానం

**- మాజీ మంత్రి, రాంరెడ్డి దామోదర్ రెడ్డి**



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : యువజన కాంగ్రెస్ తోనే కాంగ్రెస్ పార్టీలో ఉన్నత స్థానం లభిస్తుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్ లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ లో కష్టపడి పని చేసిన వారికి భవిష్యత్ లో కాంగ్రెస్ పార్టీలో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందన్నారు. భారత యువజన కాంగ్రెస్ కు మూలమైన యువశక్తిని వెలికి తీసేందుకు యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 కార్యక్రమం గొప్ప అవకాశమన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సీసెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎండి అంజద్ అలీ, నల్లగొండ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జావేద్ బేగ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, నాయకులు రావుల రాంబాబు, పందిరి మల్లేష్, జమండ్ల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు

**- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి. నిత్య సరుకులు, గృహోపకరణాలు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ క్రింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేసిన విషయమై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులను చైతన్య పరిచి ఫిర్యాదులు తీసుకుని జిల్లాలో రెండు కేసులు నమోదు చేశాం అని ఎస్పీ గుర్తుచేశారు. చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్ను తారు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, వాట్సప్ నెంబర్ 8712672222 ద్వారా ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు తిరిగి పొందే అవకాశం ఉంటుంద జిల్లా లో సైబర్ సెక్యూరిటీ సెల్ నిర్వహిస్తున్నము. డిఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా సైబర్ సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు అని అన్నారు.

# సూర్యాపేట పోరాటాల పురిటిగడ్డ

**గత ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసిన చరిత్ర**




సూర్యాపేట యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : సూర్యాపేట పట్టణ అభివృద్ధి లో అందరూ భాగస్వాములు కావాలని, సూర్యాపేట పట్టణంలో శాంతియుత వాతావరణంలో ఇప్పటి మాదిరిగానే ప్రజలు మున్ముందు అందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు జరిగిన సూర్యాపేట మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని పదవి కాలం ముగింపు సందర్భంగా కౌన్సిలర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో సూర్యాపేట మున్సిపాలిటీకి పెద్దఎత్తున నిధులు తీసుకుని వచ్చి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సూర్యాపేట పోరాటాల గడ్డ అని, ఇక్కడ వ్యాపారులు కూడ పోరాటాలలో పాల్గొన్న చరిత్ర వుందని, ఆ చైతన్యంతోనే దళిత మహిళను మున్సిపల్ చైర్మన్ గా నియమించామని అన్నారు. గతంలో సద్దల చెరువు ను మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాణం చేసుకున్నామని, పుల్లారెడ్డి చెరువు వద్ద పనులు పూర్తి కాలేదని, అలాగే నల్లచెరువు వద్ద కూడ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేయడానికి సూర్యాపేట ఎమ్మెల్యే గా తనవంతు కృషి చేస్తానని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కార్మికులు, సిబ్బంది మెరుగైన పనితీరుతోనే మున్సిపాలిటీ కి జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, పట్టణ అభివృద్ధి లో శాంతి భద్రతలను కాపాడడంలో సమన్వయంతో కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు. పట్టణంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ లు ప్రశ్నించారు. బస్తీలలో నీటి సరఫరా ను మెరుగు పరచాలని, పేదలు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్ లు కమీషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, 42 వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల రాజశ్రీ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలని, అనేక మార్లు కౌన్సిల్ సమావేశంలో చెప్పినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు.అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఫ్లోర్ లీడర్ లు, కౌన్సిలర్ లతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

# తాను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదు

**-అవంతిపురం గ్రామ కార్యదర్శి సోమిడి గాయత్రి**



మిర్యాలగూడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : అవినీతి, అక్రమాలకు తాను పాల్పడలేదని కావాలని తనపై సురేష్ ఆరోపణలు చేశారని మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామపంచాయతీ కార్యదర్శి సోమిడి గాయత్రి వివరణ ఇచ్చారు. మంగళవారం మిర్యాలగూడలో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ట్రాక్టర్, ట్రాలీ రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత పత్రాలు మాజీ ఎంపిటీసి భర్త అయిన ఆర్టీఏ ఏజెంట్ సురేష్ రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి తన వద్దే ఉంచుకున్నారని, రిజిస్ట్రేషన్ కోసం డిడి సిద్ధంగా ఉంచుకున్నాని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 628 లో ప్రభుత్వ భూమి ఉందని మొత్తం 2015-16 రివిజన్ రికార్డు ప్రకారం రికార్డులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రికార్డు మార్చడానికి, జనన మరణ ధృవీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికేట్స్ ఇవ్వడానికి డబ్బులు తీసుకుంటునన్న ఆరోపణలు నిరాధారమని, వాస్తవం లేదని అన్నారు. 2 సంవత్సరాల క్రితం పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కొత్తగా లే ఔట్లు చేయలేదని అయిన తనపై ఆరోపణలు చేశారని ఆమె చెప్పారు. తను విధులలో చేరినప్పటి నుంచి చెప్పినట్లు చేయాలని, గ్రామ పంచాయతీ నిధుల నుంచి పనులు ఇవ్వాలని, ఆయన ఖాళీ భూమి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారని ఆమె అన్నారు. తనను మానసికంగా వేధించారని ఆమె తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ పీరియడ్ నుండీ తాను చెప్పినట్లు చేయాలని లేకుంటే గ్రామ ప్రజలతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయిస్తానని, దూర ప్రాంతానికి బదిలీ చేయిస్తానని, మనోభావాలను దెబ్బ తినే విధంగా తన అనుచరులతో ఒక మహిళా ఉద్యోగి అని చూడకుండా వాట్స్ యాప్ గ్రూపులో పోస్టులు అవమానకరంగా పెట్టించారని ఆరోపించారు. నన్ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని ఉన్నతాధికారుల విచారణకు సిద్ధమని ఆమె తెలిపారు

# మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు



దుబ్బాక, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేసిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఎన్ ఆర్ ఇ జి ఎస్ ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు గాను చిట్టాపూర్ గ్రామంలో 12 లక్షల రూపాయలు, బేగంపేట గ్రామంలో ఐదు లక్షల రూపాయలు, వీరారెడ్డి పల్లి గ్రామంలో బండ మల్లన్న దేవాలయం వద్ద 20 లక్షలు రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం అయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధిపరిచే బాధ్యత తాను తీసుకుంటానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా అయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో వసంత నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఆవరణ లో ట్రాఫిక్ రూల్స్, రాష్ డ్రైవింగ్, త్రీబుల్ రైడింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్, వాహన ధ్రువీకరణ పత్రాల ఉపయోగం పై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎంప్లాయి విధిగా ఇంటి నుండి బయటకు వెళ్తున్నారంటే హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని డ్యూటీ సమయం కంటే ముందుగానే బయలుదేరాలని, తొందరపాటు తో అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరికి స్వీయ రక్షణ ముఖ్యం అని కావున ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. అతివేగంగా అజాగ్రత్తగా సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదు. ఫోర్ వీల్ వాహనాలు నడిపినప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించి ఉండాలి. ప్రతి ఒక్కరూ కుటుంబం పట్ల సమాజం పట్ల బాధ్యతగా ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలి. మన నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, సెక్యూరిటీ ఇంచార్జ్ రవీందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## జూరాలను వెంటాడుతున్న నీటి లీక్ సమస్య



హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : తెలంగాణలో కృష్ణా నదిపై ఉన్న మొట్టమొదటి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతుంది, 2021లో రిపేరు పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు కేవలం 25శాతం పనులు మాత్రమే కంప్లీట్ చేశారు. గేట్లు రోఫ్ డామేజ్, గేట్ల నుంచి నీటి లీకేజీల రిపేర్ పనులు మాత్రం ఇప్పటి వరకు చేయలేదు దీంతో నీటి లీకేజీ సమస్య పెను సమస్యగా మారింది. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ఈ వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోని పలు గేట్లు డ్యామేజ్ అయిన సంగతి తెలిసిందే. అయితే గత సీజన్లో అయినా డ్యామేజ్ కారణంగా ప్రజెక్టును నేటికి లీకేజీ సమస్య వెంటాడు తుంది.. ప్రస్తుతం డ్యామ్ లోని 12 క్రస్ట్ గేట్ల నుంచి కంటిన్యూ గా నీరు లీక్ అవుతుంది. ఇందులో 8 క్రస్ట్ గేట్ల రోప్ డ్యామేజ్ అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే గత సీజన్లో అయిన డ్యామేజ్లకు మరమ్మతులు చేయక పోవడంతో తుప్పుపట్టి గేట్లకు అమర్చిన రబ్బర్లు ఊడిపోయినట్లు తెలుస్తుం ది. ఈ ప్రాంతంలో అధికంగా నీరు లీక్ అవుతుండగా.. ప్రాజెక్టు అధికారులకు ఎం చేయాలో తోచని పరిస్థితి నెలకొంది. అయితే దాదాపు 12 గేట్ల నుంచి లీకేజీతో నీరు వృధాగా పోతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కంటిన్యూగా నీరు లీక్ అయితే వచ్చే వేసవి నాటికి జూరాల ప్రాజెక్టు నీటి పై ఆదారపడిన ప్రజలకు నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంది. అలాగే జూరాల ప్రాజెక్ట్ భద్రతపై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని, మరి దీనిపై తెలంగాణ సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి మరి..

## అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

### డిఎస్పీ సుభాష్ చంద్ర బోస్

మెదక్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పిరమిడ్, మల్టీ లేవలింగ్ మార్కెటింగ్ మోసల గురించి ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డిఎస్పి సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రక రకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజలనుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్ లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారు. ఇలాంటి నూతన స్కీం ల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఒక్క ముఖ్య విషయం గుర్తుంచుకోండి, ఎవరూ ముఖ్యంగా మనకు ఎటువంటి సంబంధం లేని వాళ్ళు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చెయ్యరు. మనల్ని నమ్మించి, మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి, మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే వారి పని అని అన్నారు. మన ఆశ, అత్యాశ వారి ఆయుధాలు.. కాబట్టి ఇలాంటి నేరాల పట్ల, మొబైల్ ఫోన్లను చూసే మనకు పేస్ బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఈమెయిల్, ఫోన్ కాల్ ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఈ కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగకండి, తొందరపడి బాధలను, నష్టాలను కొని తెచ్చుకోకండి. ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, www.cybercrime.gov.in ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో పిర్యాదు చెయ్యగలరు. ఆలస్యం విషం, అత్యాశ కొంప ముంచుతుందనే నానుడులను మనసా వాచా కర్మణా నమ్మండని మెదక్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ, సుభాష్ చంద్ర బోస్ తెలిపారు.



మెదక్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : సంక్షేమ పథకాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం హవేలీ ఘన్పూర్ మండలం ఔరంగాబాద్ తాండ ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమం జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీకి ఈ నెల 16 నుండి 20వ తేది వరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారని అట్టి జాబితాను ఫైనల్ చేయుటకు ప్రజల అభిప్రాయాలు సేకరణకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజల, మధ్యలో ఎంపిక జరగాలని నిష్పక్షపాతంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకాల అమలులో భాగంగా 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. ఏటా నియోజకవర్గానికి 3500 ఇళ్ళు ఇస్తున్నామని, ఇలా రానున్న నాలుగేళ్ల కాలంలో ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఉండటానికి గూడు లేని నిరుపేదలకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు రాని అర్హులైనవారు. గ్రామ సభల్లో కానీ ఎంపీడీవో కార్యాలయంలో కానీ దరఖాస్తులు ఇవ్వాలని అట్టి దరఖాస్తులను విచారణ నిర్వహించి వారికి సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాణిక్యం, సంబంధిత అధికారులు

## క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తింపు

### జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మంగళవారం రోజున మేడిపల్లి మండలంలో దమ్మన్నపేట గ్రామం మరియు కోరుట్ల పట్టణంలోని 2 వార్డ్ లో జరుగుతున్న గ్రామ సభలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే అర్హులైన పేదవారికి ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గ్రామ సభలలో 4 పథకాలకు ద్వారా ఎంపిక చేయబడిన అర్హుల జాబితా గ్రామ సభలు అర్హుల పేర్లను ప్రవేశపెట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నాలుగు పథకాల ద్వారా అధికారులందరూ క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులను జాబితా ఈరోజు గ్రామసభలో ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. గ్రామసభ ఆమోదంతో అర్హత పొందిన వారికి ఈ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా లిస్టులో ఈ గ్రామంలో పేర్లు రాని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా ఆత్మీయ భరోసాలు పథకాలు గ్రామసభలు ద్వారా ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతినిరుపేదలకు ప్రతి పథకాన్ని అందజేస్తుందని అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో, జివాకార్ రెడ్డి ఎమ్మార్వో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువత క్రీడలను అందిపుచ్చుకోవాలి

జగిత్యాల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : మాజీ మంత్రి జువ్వడి రత్నాకర్ రావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ ప్రారంభోత్సవంలో జువ్వడి నర్సింగ్ రావు రావ్ తో కలసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్.. మంగళవారం రోజున కోరుట్ల పట్టణంలో కాలేజీ గ్రౌండ్లో నిర్వహిస్తున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు మెమోరియల్ కోరుట్ల ప్రైమర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కు పుష్ప గుచ్చం ఇచ్చి సదర స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత ఐదు సంవత్సరాలుగా కోరుట్ల పట్టణంలో ఐపీఎల్ మాదిరిగా కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ కోరుట్ల క్రికెట్ క్లబ్ నిర్వహించనుంది. 25 రోజులు జరగనున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీపడుతున్న 12 జట్లు కోరుట్ల ప్రాంతంలోని దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులను వేలంపాట ద్వారా సెలెక్ట్ చేసుకున్న టీం యజమానులు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆరోగ్యం కాపాడుకోవడానికి, స్నేహం పెంపొందించుకోవడానికి క్రీడలే ముఖ్యం రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాముఖ్యతనిచ్చి యంగ్ ఇండియన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ని హైదరాబాద్ లో స్థాపించడం, అలాగే జిల్లాలలో కూడా క్రీడలను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశించింది. కోరుట్లలో స్వచ్ఛందంగా క్రీడలను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని గ్రామీణ పట్టణాల్లో నిర్వహించాలని, కోరుట్లలో క్రీడల కోసం అవసరమైన సౌకర్యాలని, భూములను పరిశీలించి కేటాయిస్తాం అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్ రెడ్డి, మెట్ పెల్లి డి.ఎస్.పి, రాములు, క్రికెట్ స్పోర్ట్స్ యాజమాన్యం క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : అర్హత ఉన్నవారందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కొండపాక మండలం దర్గా గ్రామంలో, చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో పాల్గొన్నారు. గ్రామ సభల సందర్భంగా ప్రజా పాలన గ్రామ సభ ఉద్దేశాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నేటినుండి 24 వ తేదీ వరకు నాలుగు రోజులు ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, ఇప్పటికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేయడం జరిగిందని ఆ వెరిఫికేషన్ జాబితా ను గ్రామసభలలో సభ్యులకు వినిపించి అనర్హులు అర్హత ఉండి జాబితాలో లేని వారి గురించి ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లో దరఖాస్తులను స్వీకరించి మళ్లీ ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి తుది జాబితాను రూపొందించడం జరుగుతుంది అని అన్నారు. 2023 24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఈజీఎస్ లో కూలీలుగా పనిచేసే భూమిలేని రైతు కూలీలను ఎంపిక చేసి సంవత్సరానికి 12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ఇవ్వడం జరుగుతుందని, వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి రైతు భరోసా కింద సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున అందించడం జరుగుతుందని అదేవిధంగా వ్యవసాయ యోగ్యం కానీ రాళ్లు రప్పలు ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల కింద పైన భూమి, రహదారులు, వెంచర్లు తదితర భూములకు రైతు భరోసా ఇవ్వడం కుదరదని తెలిపారు. ఇప్పటికే కొత్త రేషన్ కార్డుల జారీకి మరియు కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రజా పాలన కార్యక్రమం మరియు సోషియో ఎకనమిక్ సర్వే ద్వారా సేకరించిన డాటా ఆధారంగా దరఖాస్తు చేసుకున్న వారి జాబితా సిద్ధం చేయడం జరిగిందని ఆ జాబితాలో అభ్యంతరాలు, అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని వారు సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ, వార్డు సభల సమావేశానికి రానివారు మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇల్లు లేని వారిలో సొంత ఇంటి జాగా ఉండి కొంత మంది సొంత ఇంటి జాగా లేని వారు మరియు నివాసానికి యోగ్యం కానీ ఇండ్లలో ఉంటున్న వారు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి లిస్టు తయారు చేయడం జరిగిందని ఆ లిస్టులో పేరు లేని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మొత్తానికి ఇల్లు లేని వారు, పూరి గుడిసెలు, పెంకుటిన్లలో నిర్వహించే వారికి, వితంతువులకు, దివ్యాంగులకు, ట్రాన్స్ జెండర్ లకు వ్యవసాయ కూలీలకు ప్రాధాన్యత క్రమంలో ఇల్లు కేటాయించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియ కాబట్టి గ్రామ,వార్డు సభలో చదివే లిస్టులో పేర్లు లేని వారు ఎవరు ఆందోళన చెందకుండా గ్రామ, పట్టణ సభలు మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవ కేంద్రాలు, కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమాలలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతలో కుటుంబం పాత్ర కీలకం




సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు కేవలం వాహనదారులకే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడికి అవసరమని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉన్నాయి వాహనదారులకే పరిమితం అన్నది అపోహ మాత్రమే.. తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దలు అందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఇది వ్యక్తిగత భద్రతకే కాకుండా కుటుంబ రక్షణకు ముఖ్యమైనదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, కారులో సీటు బెల్ట్లు ఉపయోగించాలి. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వాడకూడదు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించడం అవసరం. సైకిల్ నడిపేటప్పుడు, స్కూల్కి నడిచేటప్పుడు ట్రాఫిక్ నియమాలను పాటించేలా పిల్లలకు నేర్పించాలి భారత్లో ప్రతి సంవత్సరం సుమారు 1.5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ట్రాఫిక్ పోలీసులే కాకుండా, ప్రతి పౌరుడి బాధ్యతతోనే రోడ్డు భద్రత సాధ్యమవుతుందనీ అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. రోడ్లను సురక్షితంగా మార్చుడానికి ప్రతి కుటుంబం కలిసి పనిచేయాలి. ముందుచూపు, జాగ్రత్తలు, క్రమశిక్షణతో రోడ్డు భద్రతను మెరుగుపరచవచ్చుని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ లు సదాశివ్, ఉమేష్ ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## భట్టి విక్రమార్క మల్లు




రాజన్న సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల లబ్ది చేకూర్చాలని, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి లతో కలిసి గ్రామ సభల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, 4 నూతన పథకాల అమలు కోసం నేడు గ్రామ సభలు ప్రారంభించి రాష్ట్రంలో మొదటి రోజు 4938 గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరిగిందని అన్నారు. గ్రామ సభలలో ప్రదర్శించిన పథకాల అర్హుల ప్రాథమిక జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా స్వీకరించి విచారణ చేపట్టాలని, అనర్హులుగా తేలితే జాబితా నుంచి తొలగించాలని, గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదని, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమేనని ప్రజలకు తెలియజేయాలని, అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తులు తీసుకుంటామని విచారించి అర్హులకు తప్పనిసరిగా పథకాలు అందిస్తామని ప్రజలకు స్పష్టంగా అధికారులు తెలుపాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రజా సంక్షేమ కార్యక్రమాల లబ్ధి పొందాలంటే ప్రజలు ఎప్పుడైనా మండలాలు , మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించ వచ్చని అన్నారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హులను ఎంపిక చేసి పథకాలను వర్తింప చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మన రాష్ట్రంలో 91 లక్షల తెల్ల రేషన్ కార్డులు 2 కోట్ల 80 లక్షల లబ్ధిదారులతో ఉన్నాయని, గత 10 సంవత్సరాలలో నూతన రేషన్ కార్డులు జారీ చేయని కారణంగా ప్రస్తుతం ప్రజల నుంచి అధికంగా డిమాండ్ ఉందని అన్నారు. ప్రజా పాలన, మీసేవ కేంద్రాలలో రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమానికి రేషన్ కార్డు లింక్ ఉండటంతో అర్హులందరికీ రేషన్ కార్డు జారి అయ్యేలా చూడాలని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రజలకు విశ్వాసం కల్పించాలని, నూతన దరఖాస్తులను స్వీకరించాలని, మన దగ్గరకు వచ్చిన ప్రతి దరఖాస్తు నువ్ విచారించి అర్హత ఉంటే రేషన్ కార్డు జారీ చేయాలని మంత్రి ఉత్తం తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వే అనంతరం ఇండ్లు లేని దాదాపు 30 లక్షలమంది అర్హులను గుర్తించి వివరాలు జిల్లాలకు పంపామని, వీరిలో ఇంటి స్థలం ఉన్నవారిలో ప్రాధాన్యత క్రమం లో నిరుపేదలను మొదటి విడత కింద తీసుకొని ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మొదటి రోజు 75 గ్రామ పంచాయతీలలో , 18 మున్సిపల్ వార్డులలో మొత్తం 93 సభలు ప్రశాంతంగా జరిగాయని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజలు అధికంగా దరఖాస్తులు అందించారని, ప్రతి దరఖాస్తులు పరిశీలిస్తూ విచారించి అర్హులైన ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ , డి.ఆర్. డి. ఓ. శేషాద్రి, డి.ఏ.ఓ. అఫ్జలి బేగం, సి.పి.ఓ.శ్రీనివాస చారి, పి.డి. హౌసింగ్ చెన్నయ్య సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డ్ సభలకు ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో మంగళవారం పథకాల కోసం సభలు నిర్వహించారు. తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పరిశీలించారు. అర్హుల గుర్తింపు కోసం చేపట్టిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో అర్హుల గుర్తింపు సభలు నిర్వహిస్తున్నామని వివరించారు. అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు అనేవి నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని వారు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు కు అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఆయా పథకాలు అర్హులైన వారికి అందుతాయని, ఎంపిక పారదర్శకంగా చేపడుతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ఉదయం 9 గంటలకు మొదలు..

జిల్లాలోని రుద్రంగి, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట తదితర మండలాల్లో 75 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 4, 5, 6, 8, 9, 16, 17, 18, 19, 28 వార్డ్ ల్లో, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1, 2, 8, 12, 18, 21, 22, 25 వార్డ్ ల్లో మొదటిరోజు గ్రామ, వార్డ్ సభలు నిర్వహించారు. ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంట వరకు అలాగే మధ్యాహ్నం 01.00 గంటల నుంచి 04.00 గంటల దాకా సభలు చేపట్టారు..

# హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్

## అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స

## పోలీసుల దాడితో బట్టబయలైన వ్యవహారం

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21: హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్ బట్టబయలు అయ్యింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరుగుతున్న గుట్టును పోలీసులు రట్టు చేశారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ వ్యవహారం కలకలం రేపింది. అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహణ, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు.. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అమాయకులకు డబ్బులు ఆశ చూపి, ఇతర ప్రాంతల నుంచి డాక్టర్లను తీసుకొచ్చి కిడ్నీ మార్పిడి చికిత్సల ద్వారా డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం బయటికి వెలుగు చూడటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పోలీసుల సహకారంతో తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఇద్దరికి కిడ్నీ మార్పిడి చికిత్సలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు కిడ్నీలు ఇవ్వగా.. వాటిని కర్ణాటకకు చెందిన ఇద్దరు రోగులకు అమర్చినట్టు దర్యాప్తులో తేలింది. కిడ్నీ దాతలతో పాటు, ఇద్దరు రోగులను నాలుగు అంబులెన్స్‌లలో పోలీసులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆరు నెలల క్రితమే అలకనంద ఆసుపత్రి ప్రారంభమైందని, ఇద్దరు వైద్యులతో చిన్న.. చిన్న శస్త్ర చికిత్సలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇటీవలే వారికి కిడ్ని మార్పిడి చికిత్స జరగడంతో రోగులు అనారోగ్యానికి గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అలకనంద ఆసుపత్రిని సీజ్ చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రి ఎండీ సుమంత్ చారీ, ఆసుపత్రి సిబ్బందిని అరెస్ట్ చేసినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.

# నేతన్నల అండగా ప్రజా ప్రభుత్వం

## సిరిసిల్ల నేతన్నలకు ఇందిరా మహిళా శక్తి చీరలు

## ఇప్పటికే పెండింగ్ లో ఉన్న 500 కోట్ల బకాయిలు విడుదల

## రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రాజన్న సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : సిరిసిల్ల చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫాం చీరల ఆర్డర్ ఇచ్చి పెద్ద ఎత్తున పని కల్పించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అందించే ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అందరికీ ఒకే రంగు గల ఒక్కొకరికి ఒక్కో చీరను అందజేసేందుకు 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30 వ తేది లోపు ఈ చీరలు సిద్ధం కానున్నాయని ఆకాంక్షించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల కి 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్స్ ఆర్డర్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పటికే పెండింగ్ లో ఉన్న వివిధ శాఖలకు సంబంధించి 500 కోట్ల బకాయిలు విడుదల చేశామని తమ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను విస్మరించిందని బకాయిలు కూడా చెల్లించకుండా చేనేత కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందని మంత్రి తెలిపారు.

# విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ

## -రూ. లక్ష 40 వేల చెక్కును అందించిన జిల్లా కలెక్టర్

## -కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని కుటుంబ సభ్యులు



రాజన్న సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : బధిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి తండ్రి పోచయ్య. ఈమె కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టిలోకి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది. మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు దోమకొండ లహరి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దశ తిరిగిందిరోయ్..

## దండలు అమ్మిన తేనెకళ్ల సుందరికి సినిమా ఆఫర్..

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21: గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన ఓ అమ్మాయి ఫోటోస్, వీడియోస్ చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. కాటుక పెట్టిన తేనె కళ్లు.. డస్కీ స్కీన్.. అందమైన చిరునవ్వు.. చూడగానే కట్టిపడేసే అందంతో మహాకుంభమేళాకు వచ్చిన ప్రజలను మంత్రముగ్దులను చేసింది. దీంతో ఆ అమ్మాయి ఓవర్ నైట్ సెన్సెషన్ అయిపోయింది. ప్రపంచంలో ఏమూల ఏం జరిగినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరలవుతున్న సంగతి తెలిసిందే. అంతేకాదు ఎంతోమందికి జీవితాన్ని ఇచ్చింది. ముఖ్యంగా నటనపై ఆసక్తి ఉండి సినీరంగంలోకి రావాలనుకునేవారికి ఎంతో ఉపయోగపడింది. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఓ అమ్మాయి ఫోటోస్, వీడియోస్ తెగ వైరలవుతున్నాయి. కాటు దిద్దిన అందమైన తేనె కళ్లు.. డస్కీ స్కీన్, సింపుల్ హెయిర్ స్టైల్ తో మహా కుంభమేళాలో స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. ప్రస్తుతం ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న కుంభమేళాలో దండలు అమ్ముకుంటున్న ఆ అమ్మాయి అందానికి ఫిదా అయిన కొందరు.. వెంటనే తన ఫోటోస్ నెట్టింట షేర్ చేయడంతో చాలా ఫేమస్ అయిపోయింది. ఆ అమ్మాయి పేరు మోనాలిసా. మధ్యప్రదేశ్ ఇండోర్ కు చెందిన ఆ అమ్మాయి కుంభమేళాలో దండలు అమ్ముకోవడానికి తన కుటుంబంతో కలిసి వచ్చింది. ఆమె తేనెకళ్లు.. చూడచక్కని రూపం చూసి ఫిదా అయిన కొందరు ఆ అమ్మాయి ఫోటోస్, వీడియోస్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో చాలా పాపులర్ అయ్యింది. చిన్నప్పటి నుంచి దండలు అమ్ముతూ తన తల్లిదండ్రులకు సాయం చేస్తుంది. ఈ క్రమంలోనే కుంభమేళాలో తన కుటుంబంతో కలిసి దండలు విక్రయిస్తున్న ఆ అమ్మాయి నెట్టింట పాపులర్ కావడంతో ఇప్పుడు ఆమెకు బాలీవుడ్ ఇండస్ట్రీలో సినిమా ఛాన్స్ ఇచ్చారట. డైరెక్టర్ సనోజ్ మిశ్రా త్వరలోనే ఆ అమ్మాయిని కలవనున్నారని టాక్. సనోజ్ మిశ్రా మాట్లాడుతూ మోనాలిసా రూపం.. ఆమె



అమాయకత్వాన్ని చూసి తాను ఫిదా అయ్యాయని.. తనకు డైరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో ఛాన్స్ ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. ఈ సినిమా కోసం ఇలాంటి అమ్మాయినే వెతుకుతున్నానని.. ఇందులో రైతు కూతురి పాత్ర కోసం మోనాలిసా సెట్ అవుతుందని.. త్వరలోనే ప్రయాగ్ రాజ్ వెళ్లి ఆమెను కలవనున్నట్లు తెలిపారు. మోనాలిసాకు యాక్టింగ్ నేర్పిస్తామని అన్నారు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ స్టార్ రాజ్ కుమార్ రావు అన్నయ్య అమిత్ రావు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టనున్నట్లు టాక్.

# మహిళా కమిషన్‌కు వేణుస్వామి క్షమాపణలు

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21: మహిళా కమిషన్ నోటీసులతో దెబ్బకు దిగి వచ్చిన వేణుస్వామి క్షమాపణలు చెప్పారు. అలాగే గతంలో తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. గతంలో నాగచైతన్య, సమంతలు ఎలా అయితే విడిపోయారో.. ఇప్పుడు నాగ చైతన్య, శోభితలు కూడా ఎక్కువ కాలం కలిసి ఉండరని జోష్యం చెప్పిన వేణు స్వామి.. ఉమెన్ కమిషన్ ముందు నాగ చైతన్య, శోభితలపై గతంలో తను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉమెన్ కమిషన్‌కు కూడా ఆయన క్షమాపణలు చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకూడదని వేణు స్వామిని ఉమెన్ కమిషన్ హెచ్చరించింది. నాగ చైతన్య, శోభితల ప్రేమ వ్యవహారం బయటికి రావడం, ఆ తర్వాత పెళ్లి అనేలా వార్తలు వచ్చిన నేపథ్యంలో వేణు స్వామి ఎప్పటిలానే ఆ జంటపై జోష్యం చెప్పి.. ఇద్దరూ మళ్లీ విడాకులు తీసుకుంటారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఫిలిం జర్నలిస్టులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఉమెన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉమెన్ కమిషన్, వేణు స్వామికి నోటీసులు జారీ చేసింది. ఉమెన్ కమిషన్ నోటీసులను సవాలు చేస్తూ వేణు స్వామి హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు కూడా ఉమెన్ కమిషన్ ముందు హాజరు కావాల్సిందేనని తేల్చి చెప్పింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేణు స్వామికి మరోసారి నోటీసులు జారీ చేసింది ఉమెన్ కమిషన్. దీంతో మంగళవారం ఉమెన్ కమిషన్ కార్యాలయానికి హాజరైన వేణు స్వామి.. గతంలో తను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని తెలిపి, క్షమాపణలు కోరారు.



**( పెండ్యాల రామ్ కుమార్, మంథని ):** స్వామి రామానంద తీర్థ స్వాతంత్ర సమరయోధుడు, హైద్రాబాద్ సంస్థాన విమోచనానికి పాటు పడ్డ మహానాయకుడు, భారత పార్లమెంట్ మాజి సభ్యుడు, సన్యాసి, కార్మిక నాయకుడు, విద్యావేత్త.
ఈయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భాపూరావు, తల్లి యసుబాయి. 1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండిపోయిన ధీరోధాత్తుడు ఆయన. కళాశాల చదువుకు స్వస్తి చెప్పి, పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టాని పొందారు. తొలుత కార్మిక రంగంలో పనిచేసి, కారాగార శిక్ష అనుభవించి ఆరోగ్యం అనుకూలించక, మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని హిప్పర్గిలో నెలకొల్పబడిన జాతీయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులై, ఆరు సంవత్సరాలపాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు వీరికి 'విద్వత్ సన్యాసం ' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, ఈయనకు 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయరంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. స్టేట్ కాంగ్రెస్ అనే సంస్థను నెలకొల్పడానికి స్వామీజీ ప్రయత్నం చేస్తుండగా, స్టేట్ కాంగ్రెస్ సంస్థను నిజాం ప్రభుత్వం 1938 సెప్టెంబర్లో నిషేధించింది. ఆ నిషేధాజ్ఞలకు నిరశనగా స్వామి రామానంద తీర్థ హైదరాబాదులో 1938 అక్టోబరు 27వ తేదీన సత్యాగ్రహం చేయగా ప్రభుత్వం ఆయన్ను బంధించి, 18 నెలలు కఠిన శిక్షనమలుచేశారు. స్టేట్ కాంగ్రెస్ సంస్థపై నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియచేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942-1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింపబడ్డ బొంబాయి కాంగ్రెస్

కావాలని ఉద్యమాన్ని ప్రారంభించినందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల పొందారు. రామానంద తీర్థ నాం దేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకులు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులుగాను, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను ఆయన పనిచేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నారు. 1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు స్వామీజీ ఆహ్వానసంఘాధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణా జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసమేర్పరు చుకొన్నారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామీజి 1972 జనవరి 22 వ తేదీన హైదరాబాదులో నిర్యాణం చెందారు.

# కులగణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు

కరీంనగర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కులగణన సర్వే ఆధారంగా జారీ చేయనున్నారు. అయితే కులగణనలో ఖచ్చితత్వం ఎంత? అన్న దానిపైనే ఇప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇళ్లకు వచ్చి యజమానులు చెప్పిన వివరాల ఆధారంగానే నమోదు చేసుకుని సర్వే సిబ్బంది వెళ్లారు. అయితే ఇది ఖచ్చితమైన సమాచారం అనేది మాత్రం క్లారిటీ లేదు. కొందరు పొలాలు, ఆస్తులను దాచి ఉంచారన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ప్రభుత్వ పథకాలు తమకు అందవన్న భయంతోనే ప్రజలు తమ ఆస్తుల విషయాన్ని బయటపెట్టలేదని కూడా వార్తలు వచ్చాయి. అదే సమయంలో సిబ్బంది కూడా తూతూమంత్రంగా చేసిన ఈ సర్వే ప్రాతిపదికన రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. కులగణన లో అనేక ప్రశ్నలు వేశారు. యాభైకి పైగా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో సర్వే సిబ్బంది యాంత్రికంగానే వ్యవహరించారు. కనీసం వారి ఆదాయం గురించి కూడా ఆరా తీయలేదు. దీనివల్ల అనర్హులు ఎక్కువ మంది తెలుపు రంగు రేషన్ కార్డులు పొందే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రేషన్ కార్డుల జారీకి కులగణన సర్వే ప్రాతిపదిక కాకూడదు. దానికి నిబంధనలు వేరుగా ఉంటాయి. ఆదాయ పరిమితితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పుడు తెలంగాణ జరిగిన కులగణన వల్ల ఖచ్చితమైన సమాచారం వచ్చిందన్న నమ్మకం ఎవరికీ లేదు. మరి దాని ప్రాతిపదికన ఎలా రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్న ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు.పాత రేషన్ కార్డులను కూడా తొలగించే ప్రసక్తి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈనెల 26 నుంచి తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగనుంది. రేషన్‌కార్డుల ఫైనల్ లిస్ట్ ను దాదాపు అధికారులు సిద్ధం చేశారు. కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. కొత్తగా ఆరున్నర లక్షల రేషన్‌కా ర్డులు ప్రభుత్వం జారీ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కూడా గ్రామసభలో నిర్ధారించి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయంతీసుకుందని చెబుతున్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కూడా ప్రకటన చేసింది. అయితే అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, అనవసరంగా ప్రజా ధనం దుర్వినియోగం చేసేలా కేవలం కులగణన సర్వేపై ఆధారపడవద్దన్న సూచనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మరి ఈ ప్రక్రియ సజావుగా సాగుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

గ్రామ సభల్లో ఎంపిక: ఈ నెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుచేస్తున్నామన్నారు. వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ. 12,000, భూమిలేని నిరుపేద రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ. 12,000 ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా ఎక్కడో రూపొందించకుండా, గ్రామసభలలోనే ఖరారు చేస్తామన్నారు. ఎర్రుపాలెంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. చెరువులు, అడవులను రక్షిస్తూ ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ఇంకా ఎలాంటి జాబితాలు తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల జాబితా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భట్టి విక్రమార్క ప్రారభించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన




ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి హామీ ఇచ్చారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభలలో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణలో మరోసారి రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం దరఖాస్తులను తీసుకున్నప్పటికీ? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ఇటీవలే నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా? రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు సర్కార్ ప్రకటించింది. ఈ సర్వే ఆధారంగానే ప్రాథమిక జాబితాలను సిద్ధం చేసింది. వీటిని పౌరసరఫరాల శాఖ గ్రామాల వారీగా విభజించి విడుదల చేసింది. ప్రాథమిక జాబితాలు విడుదల కావటంతో గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు లేదని పలువురు వాపోతున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని? అయినా తమ పేర్లు లేదని చెబుతున్నారు. కొత్త రేషన్ కార్డు జాబితాలు రావటంతో ప్రజల్లో అనేక అపోహాలు నెలకొన్నాయి. అయితే వీటిపై సర్కార్ క్లారిటీ ఇచ్చింది. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా ఉంటుందని స్పష్టం చేసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను జారీ చేస్తామని చెప్పింది.

సమితి మోకుదెబ్బ వరంగల్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి హన్మకొండ జిల్లా అధ్యక్షులు తోటకూర రాంధాస్ గౌడ్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ కట్టగాని రవీందర్ గౌడ్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పై నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర జనాభలో 50 శాతం పైగా ఉన్న బీసీలు ఎస్సీ, ఎస్టీ లను కలుపుకోని 2029 సాధారణ న్నికలలో బీసీ ముఖ్య మంత్రి అయ్యే విధంగా అన్ని కుల సంఘాలు ఐక్యంగా ఉద్యమించి రాజ్యాధికారం సాధించాలని అదిశగా మోకుదెబ్బ నాయకులు కార్యకర్తలు కల్లు గీత వృత్తి రక్షణ తో పాటు బీసీ లకు రాజ్యాధికారం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం ద్వారనే అన్ని సమస్యలకు పరిస్కారం దొరుకుతుందన్నారు. అనంతరం మోకుదెబ్బ జాతీయ కమిటీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను పై నాయకులు ఆవిష్కరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజు యాదవ్, బీసీ నాయకులు భీమగాని యాదగిరి గౌడ్, హన్మకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు తోటకూర రాందాస్ గౌడ్, గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర నాయకులు మద్దెల సాంబయ్య గౌడ్, తెలంగాణ గౌడ మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనంతుల కవిత గౌడ్, హన్మకొండ, వరంగల్, మహబూబబాద్ జిల్లాల నాయకులు పెరుమాండ్ల శ్రీరాం గౌడ్, తిప్పని రవీందర్ గౌడ్, టీ. వి రాజు గౌడ్, బొమ్మగాని శ్యాం గౌడ్, పొలాగాని జితేందర్ గౌడ్, గుంటి విద్య సాగర్ లతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా లోని గౌడ కులస్తులు గీత కార్మికులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల ను జయప్రదం చేయండి!



నేరేడుచర్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : ఉమ్మడి నేరేడుచర్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలకు అందరూ హాజరై జయప్రదం చేయాలని మట్టపల్లి విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర అధ్యక్షులు బొడ్డుపల్లి సుందరయ్య, నేరేడుచర్ల మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు ఎన్నికల పరిశీలకులు సూరోజు సీతారాములు,దేవులపల్లి శంకరాచారి,కొత్తూరి వెంకటేశ్వర్లు, తునికిపాటి జగన్నాధాచారి,లంకెలపల్లి శంకరాచారి,సూరోజు వెంకటేశ్వర్లు,ఉరిమళ్ల రామ్మూర్తి,వజ్రాల లింగాచారి,జానకి రామాచారి,దేవులపల్లి జనార్ధనాచారి,సూరోజు బ్రహ్మచారి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 2వ తేదీన విశ్వబ్రాహ్మణ సత్రం లో జరగనున్న ఉమ్మడి నేరేడుచర్ల విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల్లో నేరేడుచర్ల మరియు పాలకవీడు మండలాల్లో ఉన్న విశ్వబ్రాహ్మణ సోదరీ సోదరీమణులు విధిగా హాజరై నూతన కమిటీ ఎన్నికల్లో పాల్గొనాలని అలాగే విశ్వబ్రాహ్మణ సత్రం నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని అలాగే విశ్వబ్రాహ్మణులకు సంబంధించిన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు మరియు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల సాధన కొరకు అనుసరించవలసిన విధానాల కొరకు ఈ సమావేశంఏర్పాటు చేయనైనదని అందరూ హాజరై తమ అమూల్యమైన సందేశాలతో పాటు సూచనలు కూడా ఇవ్వాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాతోజు వెంకటా చారి,తంగేళ్లపల్లి,మట్టా చారి,పుల్లయ్య పాల్గొన్నారు.

# కార్యదర్శి కోసం ముగ్గురు కామేడ్స్ పోటీ

నల్గొండ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రాష్ట్ర పార్టీ కార్యదర్శి కోసం.. సీపీఎం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరుసగా మూడు టర్మ్‌లుగా రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు తమ్మినేని వీరభద్రం. పార్టీ నిబంధనల ప్రకారం ఆయనకు మరోసారి కార్యదర్శి అయ్యే అవకాశం లేదు. దీంతో పార్టీలో చాలామంది నేతలు రాష్ట్ర కార్యదర్శి సీటుపై కన్నేశారు. దీంతో ఈసారి సీపీఎం పార్టీ రథసారధి ఎవరనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఎప్పుడూ లేని విధంగా జిల్లా కార్యదర్శుల ఎన్నిక కూడా రసవత్తరంగా సాగింది. దీంతో సీపీఎం స్టేట్ సెక్రటరీ రేసు మరింత ఉత్కంఠ రేపుతోంది. త్వరలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో జరగనున్నాయి. రాష్ట్ర మహాసభల చివరిరోజు రాష్ట్ర కొత్త సారధిని ఎన్నుకుంటారు. ప్రతి మూడేళ్లకోసారి సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తారు. ఆ సభల ద్వారానే రాష్ట్ర కార్యదర్శిని పార్టీ ప్రతినిధులు ఎన్నుకుంటారు. ఒక వ్యక్తి పార్టీ కార్యదర్శి పదవికి మూడు టర్మ్‌ల కంటే ఎక్కువ కాలం ఉండకూడదనే రూల్ సీపీఎం పార్టీ ఉంది. గ్రామ కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శి వరకు మూడుసార్లు మాత్రమే కార్యదర్శి పదవిలో ఉండాలి. ప్రస్తుతం తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఉన్నారు. పార్టీ నియమం ప్రకారం తమ్మినేని టర్మ్ ముగియడంతో రాష్ట్ర కార్యదర్శి ఎవరు అవుతారనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అనారోగ్యానికి గురి అయ్యారు. అప్పటి నుంచి ఇంచార్జ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.వీరయ్య పార్టీ కార్యాలయ బాధ్యతలు చూస్తున్నారు. కొత్త కార్యదర్శి రేసులో పార్టీ సీనియర్ నేతలు ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన పోతినేని సుదర్శన్ పోటీ పడుతున్నారు. ఈసారి రాష్ట్ర కార్యదర్శి పదవి పై ఖమ్మం, నల్గొండ జిల్లా నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లా నేతలు ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. పార్టీ నిర్మాణంలో తమ జిల్లా పాత్ర ఉందని పార్టీ పదవుల్లో తమకు అన్యాయం జరుగుతోందని, ఈసారి చాన్స్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. అయితే ఈ సారి జిల్లా కార్యదర్శుల ఎన్నిక రసవత్తరంగా సాగింది చాలా జిల్లాల్లో జిల్లా కార్యదర్శి ఎన్నిక కోసం ఓటింగ్ వరకు వెళ్లింది. మరి రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక కూడా ఏకగ్రీవ అవుతుందా.? లేక ఇద్దరు ముగ్గురు నేతలు పోటీ ఉంటే ఓటింగ్ జరుగుతందా అనేది ఆసక్తికరంగా మారింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పదవి ఎవరికి దక్కబోతుందనేది చూడాలి మరి.

# ఢిల్లీకి బిల్లుల ఫిర్యాదులు

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 :అసలే కాంగ్రెస్ పార్టీ. అందరూ సీఎం క్యాండిడేట్లే. అధికారం ఉన్నా..అపోజిషన్‌లో ఉన్నా ఎవరి దారి వాళ్లదే. హస్తం పార్టీలో ఇదంతా కామన్. కాకపోతే ఇప్పుడు అధికా రంలో ఉండటంతో ప్రతీ ఇష్యూ పెద్దగా కనిపిస్తోందట. అయితే అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా అని చెప్పుకునే ప్రభుత్వ, పార్టీ పెద్దలు..తెలంగాణ క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందంటూ పదే పదే స్టేట్మెంట్లు ఇస్తున్నారు. అయితే తమ పరిస్థితి ఏ మాత్రం బాలేదంటున్నారట కొందరు అమాత్యులు. ప్రధానంగా తమ శాఖల ద్వారా ఎమర్జెన్సీగా చేసే పనులకు కూడా బిల్లులు క్లియర్ కావడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. దీంతో శాఖల రివ్యూలు చేసినప్పుడు మంత్రులకు ఇదే పెద్ద సమస్యగా మారుతోం దట. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా..ఆర్థికశాఖ మంత్రికి స్వేచ్ఛ ఉంది..ఆయన్నే అడగాలంటూ సమాధానం దాటవేస్తున్నారట. దీంతో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా తయారైందట. ఖజానాలో నిధులు లేక ఎవరికి బిల్లులు ఇస్తే ఏమవుతుందోనని ఆందోళనలో ఆర్థిక శాఖ అధికారులు డైలమాలో ఉన్నారట. ఏఐసీసీ ఆఫీస్ ఓపెనింగ్ సందర్భంగా హస్తిన వెళ్లిన నేతలు నేరుగా పార్టీ పెద్దల దగ్గర పంచాయితీ పెట్టారట. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమైన తెలంగాణ మంత్రులు, ముఖ్యనేతలు..బిల్లులు పెండింగ్‌లో ఉండటంపై వివరించారట. ప్రభుత్వంలో కొన్ని శాఖల బిల్లులు క్లియర్ అవుతున్నప్పటికీ..మిగిలిన శాఖల్లో మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేశారట మంత్రులు. బిల్లుల చెల్లింపు ఆలస్యంతో తాము ఫేస్ చేస్తున్న సమస్యలపై కేసీ వేణుగోపాల్‌తో మొర పెట్టుకున్నారట. తెలంగాణ మంత్రులకు ఎదురైన పరిస్థితి గతంలో కర్నాటక సర్కారులో కూడా వచ్చిందట. అక్కడ కూడా కొన్ని శాఖలకు సంబంధించిన బిల్లులు క్లియర్ చేసి..మిగతా శాఖల బిల్లులు పెండింగ్‌లో పెట్టారట. ఆ రాష్ట్ర మంత్రులు కూడా ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అక్కడ మధ్యేమార్గంగా ప్రతీశాఖకు ప్రతీ నెల కొంత అమౌంట్ రిలీజ్ చేయాలని..ఆయా శాఖల బిల్లులు సంబంధిత మంత్రుల ఆమోదంతోనే క్లియర్ చేయాలనే కండీషన్ తీసుకొచ్చారట. సేమ్ అలాంటి విధానాన్ని తెలంగాణలో తీసుకురావాలని ..మంత్రులకు బిల్లులు రిలీజ్ చేయాలని సూచించారట కేసీ వేణుగోపాల్. బిల్లుల కోసం అధిష్టానం పెద్దకు మొర పెట్టుకున్న తెలంగాణ మంత్రులు కష్టాలు ఎంతవరకు పరిష్కారం అవుతాయో చూడాలి మరి.



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే ఎవరికి నచ్చిన వ్యాయామాన్ని వారు చేస్తుంటారు. పోషకాహార నిపుణులు, వైద్యులు సైతం రోజూ వ్యాయామం కచ్చితంగా చేయాలని చెబుతుంటారు. రోజూ ఎంతో కొంత శారీరక శ్రమ ఉంటేనే మనం అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంటాం. వ్యాయామం కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాక మానసిక ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. వారంలో కనీసం 5 రోజులు రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని డైటిషియన్లు చెబుతుంటారు. అయితే ఎక్కువ శాతం మంది చేసే వ్యాయామాల్లో వాకింగ్ కూడా ఒకటి. ఇందుకు పెద్దగా ఖర్చు చేయాల్సిన పనిలేదు. అన్ని వయస్సుల వారు చేయదగిన చాలా సులభతరమైన వ్యాయామం వాకింగ్. **క్యాలరీలు..:** అయితే ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్ చేయాలా.. జాగింగ్ చేయాలా.. అని చాలా మంది సందేహిస్తుంటారు. జాగింగ్ అంటే కాస్త వేగంగా వాకింగ్ చేయడం. రన్నింగ్ కన్నా కాస్త తక్కువ స్పీడ్‌తో పరుగెత్తడం అన్నమాట. అయితే వాకింగ్, జాగింగ్.. రెండింట్లో ఏది మంచిది.. అనే విషయానికి వస్తే.. రెండూ మంచి వ్యాయామాలే అని చెప్పవచ్చు. కానీ వాకింగ్ కన్నా జాగింగ్ చేస్తేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు త్వరగా తగ్గుతారు. గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. కనుక ఓపిక ఉన్నవారు జాగింగ్ చేస్తేనే మంచిదని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా వాకింగ్ చేస్తే 30 నిమిషాలకు 100కు పైగా క్యాలరీలు ఖర్చు అవుతాయి. కానీ జాగింగ్ చేస్తే 30 నిమిషాలకు 200 కు పైగా క్యాలరీలను జాగింగ్ చేస్తే చాలు. కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు జాగింగ్ చేయకపో వడమే మంచిది. వీరు 30 నిమిషాల పాటు తేలికపాటి వాకింగ్ చేయాలి. ఇక మిగిలిన ఎవరు అయినా సరే జాగింగ్ చేస్తేనే ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. దీని వల్ల బరువు త్వరగా తగ్గుతారు. అలాగే గుండెకు చక్కని వ్యాయామం జరిగి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ వంటివి రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. **అనేక లాభాలు..:** అయితే వాకింగ్ లేదా జాగింగ్ ఏది చేసినా ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు చేయవచ్చు. ఓపిక ఉందనుకుంటే జాగింగ్ చేయాలి. లేదనుకుంటే కనీసం వాకింగ్ అయినా చేయాలి. ఇలా రెండింట్లో ఏది చేసినా మనకు ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయి. రెండింటి వల్ల చక్కని శారీరక శ్రమ చేయవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ రెండింటి వల్ల షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గడమే కాదు, అధిక బరువును తగ్గించుకోవచ్చు. బరువు నియంత్రణలో ఉంటుంది. హైబీపీ తగ్గుతుంది. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. కండరాలు నిర్మాణమవుతాయి. కీళ్లు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇంకా ఎన్నో విధాలుగా మనకు ఈ రెండూ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కనుక ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు ఏదో ఒకటి చేస్తుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



లండన్, : పుర్రె లోపల ఒక చిప్‌ను అమర్చి అల్ట్రాసౌండ్ ద్వారా మెదడును నియంత్రించే అధునాతన ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. బ్రెయిన్-కంప్యూటర్-ఇంటర్ఫేస్(బీసీఐ)గా పిలిచే ఈ సాంకేతికతతో అమెరికాకు చెందిన ఫారెస్ట్ న్యూరోటెక్ అనే సంస్థ ఒక బ్రెయిన్ చిప్(ఇంప్లాంట్)ను తయారుచేసింది. ఇప్పటి వరకు ఉన్న బీసీఐ ఇంప్లాంట్లను వినియోగించేందుకు ఎలక్ట్రోడ్‌లను నేరుగా మెదడులోకి పంపించాల్సి ఉంటుంది. ఈ కొత్త చిప్‌ను మాత్రం పుర్రె కింద, మెదడు బయట అమరుస్తారు. దీని ద్వారా మెదడు పనితీరును సమగ్ర 3డీ మ్యాప్‌లుగా రూపొందించవచ్చు. ఆ తర్వాత అల్ట్రాసౌండ్ తరంగాల ద్వారా మెదడులోని నిర్దిష్ట న్యూరా న్ల సమూహాన్ని శాస్త్రవేత్తలు బయటినుంచి యాంత్రికంగా ఉత్తేజపరుస్తారు. తద్వారా ఆందోళన, నిరాశ, మూర్ఛ వంటి సమస్య లను దూరం చేయవచ్చని, మూడ్‌ను మార్చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ చిప్‌పై ఇంగ్లండ్‌కు చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) మార్చి నుంచి మనుషులపై ప్రయోగాలు జరపనుం ది. ఇప్పటికే వివిధ మెదడు సర్జరీలు చేయించుకున్న వారిపై ప్రయో గాలు జరగనున్నాయి.వీరికి సర్జరీ కోసంఇప్పటికే కొంతభాగం పుర్రె తొలగించి ఉంటుంది కాబట్టివీరిపై ప్రయోగాలుచేయనున్నట్టు శాస్త్రవే త్తలు తెలిపారు. మూడేండ్ల పాటు ప్రయోగాలు జరగనున్నాయి.

# డిస్క్‌లు జారిపోవద్దు.. జాగ్రత్త!

షాక్ అబ్జార్బర్స్ వాహనాలను కుదుపులు లేకుండా ప్రయాణించేలా సహకరిస్తాయి. మనిషిలో వెన్నెముకలో ఉండే డిస్క్ కూడా అంతే. మనిషి నడవడం, కూర్చోవడం, పరిగెత్తడంలో ఇబ్బందులు పడకుం డా దోహదం చేస్తాయి. ఏవైనా కారణాల వల్ల డిస్క్‌లో సమస్య ఏర్పడితే మనిషికి శారీరకంగా ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. దీంతో కూర్చోవడం కష్టమైపోతుంది. సరిగ్గా నిలబడటం కలగా మారుతుంది. నడవడం నరకంగా ఉంటుంది. కాబట్టి, మన ఉనికికి కీలకమైన డిస్క్ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. ఈమధ్య కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలామంది నడుమునొప్పి, మెడనొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఉరుకులు పరుగుల జీవనం, గంటల కొద్దీ కంప్యూటర్ల ముందు కూర్చునే ఉద్యోగాలు, సరైన పర్యవేక్షణ లేని కసరత్తులు, గుంతలు ఉన్న రోడ్లపై ప్రయాణం మొదలైన కారణాల వల్ల ఇలాంటి రుగ్మతలు దాపురిస్తున్నాయి. చాలామందికి వీటికి గల కారణాలు తెలియవు. దీంతో పెయిన్ కిల్లర్స్‌తో కాలం గడిపేస్తారు. సమస్య ముదిరిపోయాక గానీ డాక్టర్లను సంప్రదించడం లేదు. డిస్క్, స్పాండిలోసిస్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో%ా% అసలు ఈ డిస్క్, స్పాండిలోసిస్ అంటే ఏంటి? నడుమునొప్పి, మెడనొప్పికి వీటికి గల సంబంధం, వీటి లక్షణాలు, నిర్ధారణ పద్ధతులు, చికిత్స గురించి తెలుసుకుందాం. **డిస్క్ అంటే ఏంటి?:** వెన్నెముకలో రెండు ఎముకల మధ్య ఉండే గుజ్జు వంటి పదార్థాన్ని డిస్క్ అంటారు. వాహనాలకు షాక్ అబ్జార్బర్స్ ఎలానో మనిషికి డిస్క్ అలా పనిచేస్తుంది. ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల నడుము భాగంలో కండరాలు బలహీనపడతాయి. దీంతో డిస్క్‌కు సంబంధించిన ఇబ్బందులు త్వరగా తలెత్తే అవకాశం ఉంటుంది. ఎక్కువసేపు కూర్చుని ప్రయాణాలు చేయడం వల్ల, రోడ్ల మీద గుంతలతో శరీరం కుదుపునకు గురవడం వంటి కారణా లతో కూడా డిస్క్ సమస్యలు వస్తాయి. మితిమీరిన బరువులు ఎత్తడం, సరైన పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా వ్యాయామం చేయడం కూడా డిస్క్ ఆరోగ్యానికి మంచిది కాదు. సాధారణంగా వెన్నెముక ఎముకల మధ్యలో ఉండే గుజ్జు బయటికి వచ్చి, మెడభాగంలోని నరాలపై ఒత్తిడి చేయడం వల్ల నొప్పితోపాటు కాళ్లు, చేతులు బలహీనంగా మారే ముప్పు పొంచి ఉంటుంది. ఇంకా నడుము భాగంలో గుజ్జు బయటికి వచ్చి నరాలపై ఒత్తిడి చేసినప్పుడు కాళ్లలో విపరీతమైన నొప్పి వస్తుంది. దీన్ని సయాటికా అని పిలుస్తారు. వైద్య పరిభాషలో అయితే 'రాడిక్యులోపతి' అని కూడా అంటారు. **స్పాండిలోసిస్:** వయసు కారణంగా వెన్నుపూస, డిస్క్‌లో వచ్చే మార్పులను స్పాండిలోసిస్ అంటారు. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ డిస్క్‌లో నీటి శాతం తగ్గుతుంది. దీనివల్ల డిస్క్‌లో ఎలాస్టిసిటీ (సులువుగా కదిలే తత్వం) తగ్గుతుంది. ఫలితంగా ఎముకలు రాపిడికి గురై అరిగిపోతాయి. దీంతో



నడుము లేదా మెడభాగంలో తీవ్రమైన నొప్పి, బిగుసుకుపోవడం (స్టిఫ్‌నెస్) వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మామూలుగా అయితే 40 ఏండ్ల తర్వాత ఈ సమస్య మొదలవుతుంది. అలా కాకుండా ఏవైనా ప్రమాదాలు, గాయాలకు గురైన వారిలో చిన్న వయసులోనే స్పాండిలోసిస్ తలెత్తే అవకాశం లేకపోలేదు. ఇది సర్వైకల్ స్పాండిలోసిస్, లంబార్ స్పాండిలోసిస్ అని రెండు రకాలుగా ఉంటుంది. **సర్వైకల్ స్పాండిలోసిస్ :**మెడ భాగంలో స్పాండిలోసిస్ ఏర్పడితే దానిని సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. లక్షణాలు: మెడనొప్పి. స్టిఫ్‌నెస్ వల్ల మెడ తిప్పడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. కండ్లు తిరిగినట్టుగా అనిపిస్తుంది. చేతులు, భుజాల్లో నొప్పి. చేతులు, కండరాల్లో నొప్పి. కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు రావడం, మంటగా ఉండటం. కొంతమందిలో తీవ్రమైన ఎముకల బలహీనత ఏర్పడి నడవలేని పరిస్థితి తలెత్తుతుంది. లంబార్ స్పాండిలోసిస్. నడుము భాగంలో స్పాండిలోసిస్ ఏర్పడితే అది లంబార్ స్పాండిలోసిస్. **లక్షణాలు:** నడుము నొప్పి, కాళ్లలో నొప్పి, నడవలేక పోవడం. కాళ్లలో తిమ్మిర్లు రావడం, మంటగా ఉండటం. **స్పాండిలోలిస్‌థెసిస్:** వెన్నుపూసలో రెండు ఎముకలు ఒకదానిపై మరొకటి సమాంతరంగా ఉంటాయి. అయితే, వయసు పైబడటం లేదా ప్రమాదాలు జరగడం వల్ల ఎముకలు ముందూ వెనక్కి జరిగిపోతాయి. దీన్నే స్పాండిలోలిస్‌థెసిస్ అంటారు. **లక్షణాలు:** నడుముతోపాటు కాళ్లలో తీవ్రమైన నొప్పి. దీనివల్ల రోగికి నడవటం కష్టమైపోతుంది. ఆస్టియోపొరోటిక్ ఫ్రాక్చర్. ఇది 70 ఏండ్లు దాటిన వారిలో వస్తుంది. వెన్నుపూస ఎముకలు పూర్తిగా బలహీనపడి, చిన్నపాటి గాయమైనా విరిగిపోతాయి. దీన్ని ఆస్టియోపొరోటిక్ ఫ్రాక్చర్ అని వ్యవహరిస్తారు. **నిర్ధారణ పద్ధతులు:** స్పాండిలోసిస్, డిస్క్ సమస్యలకు సంబంధించిన నిర్ధారణ పద్ధతులు ఒకే విధంగా ఉంటాయి. అయితే, రోగి లక్షణాల ఆధారంగా అది స్పాండిలోసిసా లేక డిస్క్ సమస్యనా అనేది గుర్తిస్తారు. ఎక్స్-రే, ఎలక్ట్రోమయోగ్రఫీ (ఈఎంజీ)/ నర్వ్ కండక్షన్ వెలాసిటి (ఎన్‌సీవీ), ఎంఆర్ఐ, సీటీ-స్కాన్ వంటి పరీక్షల ద్వారా సమస్యను కచ్చితంగా గుర్తిస్తారు. **రెండు రకాల చికిత్సలు:** మెడికల్ మేనేజ్‌మెంట్, సర్జికల్ మేనేజ్‌మెంట్ అని చికిత్సలో రెండు రకాల పద్ధతులు ఉంటాయి. **మెడికల్ మేనేజ్‌మెంట్:** లక్షణాల ఆధారంగా చికిత్సను ప్రారంభిస్తారు. అదే సమయంలో ఫిజియోథెరపీ కూడా చేస్తారు. కొన్ని సందర్భాల్లో మందులు పనిచేయనప్పుడు మెడ, నడుము భాగంలో ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. **సర్జికల్ మేనేజ్‌మెంట్:** సమస్య తీవ్రంగా ఉండి, మందులతో తగ్గలేని స్థితిలో ఉంటే సర్జరీ చేయాలి. దీని ద్వారా బయటికి వచ్చిన గుజ్జు భాగాన్ని తొలగించి, నరాలపై పడే ఒత్తిడిని దూరం చేస్తారు. దీంతోపాటు నరానికి సరిపోయే స్థలాన్ని ఏర్పాటుచేస్తారు. ఈ సర్జరీని మైక్రోస్కోప్ లేదా ఎండోస్కోప్ పద్ధతులను ఉపయోగించి చేయవచ్చు. సర్జరీ తర్వాత రోగిని వెంటనే నడిపించడంతోపాటు మర్నాడే డిశ్చార్జ్ చేస్తారు. ఆ తర్వాత వైద్యులు సూచించన జాగ్రత్తలు పాటిస్తూ ఫిజియోథెరపీ చేయించుకోవాలి. ఇక ఆస్టియోపొరోటిక్ ఫ్రాక్చర్స్ బాధితులకు మాత్రం 'ఆర్టిఫీషియల్ బోన్ సిమెంట్' ద్వారా వెన్నుపూస ఫ్రాక్చర్ సమస్యకు చికిత్స అందిస్తారు. అయితే, వెన్నెముక సమస్య అనగానే సహజంగానే భయం, ఆందోళన చెందుతారు. కానీ, అన్ని సందర్భాల్లో సర్జరీ అవసరం పడదు. చాలావరకు సమస్యను మందులతోనే పరిష్కరించుకోవచ్చు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ రోజువారీ జీవితాన్ని గడిపేయవచ్చు.

## డెమెన్షియా తోకముడిచేలా..



గుండెకు మేలుచేసే ఆహార పదార్థాలు డెమెన్షియాను ఢీ కొడతాయని తేలింది. హార్వర్డ్ యూనివర్సిటీ, చైనాలోని మరికొన్ని యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు 55 ఏండ్లు, ఆపై వయసు కలిగిన 10,000 మంది నుంచి ఐదేండ్లపాటు సేకరించిన సమాచారం పరిశీలించారు. ప్రతిరోజూ మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు కూరగాయలు, రెండు కంటే ఎక్కువసార్లు పండ్లు తిన్నవారిలో కాలక్రమంలో మెదడు పనితీరు బాగా ఉన్నట్టు గ్రహించారు. బ్రసెల్స్ స్ప్రౌట్స్, కాలిఫ్లవర్, కేల్, పాలకూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, స్కాష్ వంటి ఎరుపు, పసుపు కూరగాయలు మరింత మంచివి అని పరిశోధకులు పేర్కొన్నారు. మరో అధ్యయనంలో ఆలివ్ నూనె తీసుకున్న అమెరికన్లలో డెమెన్షియా సంబంధిత మరణం ముప్పు తక్కువని కనుక్కొన్నారు.

## రోగ నిర్ధారణకు కొత్తగా రక్త పరీక్షలు



స్కానింగ్‌లు, చర్మాన్ని కత్తిరించి చేసే ఇన్వేసివ్ పరీక్షలు వంటివి లేకుండానే సులువుగా రోగ నిర్ధారణ జరిగే రోజులు మరెంతో దూరంలో లేవు. పేగులకు సంబంధించిన కొలరెక్టల్ క్యాన్సర్ నిర్ధారణకు చేసే రక్త పరీక్షకు అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. ఈ పరీక్షతో 83 శాతం కచ్చితత్వంతో రోగ నిర్ధారణ జరిగిందని న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ వెల్లడించింది. అయితే ఇప్పటికీ పేగు క్యాన్సర్ నిర్ధారణకు కొలనోస్కోపీయే ఉత్తమమైన పరీక్ష. అయినప్పటికీ కొత్తగా అభివృద్ధి చేసిన రక్త పరీక్ష కూడా ఉపయోగకరమైనదే అంటున్నారు పరిశోధకులు. ఇక వృద్ధాప్యానికి సంబంధించిన అల్జీమర్స్ వ్యాధి నిర్ధారణకు 'ప్రెసివిటీ ఏడీ2' అనే రక్త పరీక్షను స్వీడన్‌కు చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. అల్జీమర్స్ నిర్ధారణలో ఇది దాదాపు 90 శాతం కచ్చితత్వంతో ఉంటుందట. దీనిద్వారా అల్జీమర్స్‌కు వీలైనంత త్వరగా చికిత్స మొదలుపెట్టొచ్చని అధ్యయనం తెలిపింది. అంతేకాదు రక్తంలో ప్రవహించే ప్రొటీన్ల విధానాన్ని బట్టి డజన్ల కొద్ది వ్యాధుల గుట్టు తెలుసుకోవచ్చని ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీ గ్లాక్సో స్మిత్‌క్లైన్‌కు చెందిన శాస్త్రవేత్తలు, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీకి చెందిన పరిశోధకులు కనుక్కొన్నారు. ఈ వ్యాధుల్లో మల్టిపుల్ మైలోమా, నాన్ హాడ్గ్‌కిన్ లింఫోమా, సీలియాక్ డిసీజ్ వంటివి కూడా ఉన్నాయి.

## పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్దిదారుల జాబితా

మంచిర్యాల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి పారదర్శకమైన లబ్ధిదారుల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల శ్రీరాంపూర్ కాలనీ 5వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో నస్పూర్ మున్సిపల్ కమీషనర్ సతీష్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతు ందని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అత్యం త నిరుపేద అర్హులకు పథకం ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో వివరాలు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాలలో, వార్డుసభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లే-అవుట్లు, రైల్వే, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. వ్యవసాయ యోగ్యం గల భూమికి రైతు భరోసా ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి, అర్హత మేరకు అర్హులైన లబ్దిదారులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు.

నర్సంపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం వరంగల్ జిల్లాలో నిర్వహించిన గ్రామసభలు ప్రజాధరణ లేక విఫలం కావడం జరిగిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా జరిగినటువంటి గ్రామ సభల్లో రైతు భరోసా రాక మోసపోయిన రైతులు,12 వేల రూపాయలు వస్తాయనుకొని మోసపోయిన రైతు కూలీలు, రేషన్ కార్డు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పెద్ద ఎత్తున నిలదీయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నాలుగు పథకాల లబ్ధి చేకూరుస్తానన్న కాంగ్రెస్ పార్టీ నిబంధనలు కఠిన తరం చేసి 10 శాతం లోపలికి కుదించడం అనేది మోసపూరిత చర్యగా అభివర్ణించారు. అందుకే ఈరోజు వరంగల్ జిల్లాలో జరిగిన గ్రామసభలో నాయకులను, అధికారులను ప్రజలు నిలదీయడం జరిగిందిని తెలిపారు. ఈరోజు వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం లో జరిగిన గ్రామసభల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పినటువంటి నాలుగు పథకాల మీద తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. తెలంగాణలో ఈ పథకాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తీవ్రమైన ప్రజా ఆగ్రహానికి నిదర్శనమని అన్నారు.

కల్లబొల్లి హామీలతో మోసపోయిన రైతు గోసపడుతున్నాడు.
అన్నివైపులా సమస్యలు చుట్టుముట్టడంతో అన్నదాత మనసు చెడి ఆత్మహత్యే శరణ్యమంటున్నాడు. అన్నపూర్ణగా విశ్వవీధుల్లో వినతులందుకొన్న గడ్డ మీద రైతన్నల మృత్యుఘోష మిన్నంటుతున్నది. కాంగ్రెస్ 400 పైచిలుకు రోజుల పాలనలో రోజుకో రైతు బలవన్మరణానికి బలవుతున్నాడు. మరో 'రైతు ఆత్మహత్య' అనేది పత్రికల్లో నిత్యశీర్షిక లా మారింది. కాంగ్రెస్ మోసకారి పాలన అమల్లోకి వచ్చిన 2023 డిసెంబర్‌లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటే, ఏడాది పాలన పూర్తయిన 2024 డిసెంబర్‌లో ఆ సంఖ్య 45కు పెరగడం దేన్ని సూచిస్తున్నది?
అసమర్థతతో, అనాదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల మరణానికి కారణమవుతున్నదనేది అక్షర సత్యం. డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి. దేవుళ్ల మీది ఒట్టును తీసి గట్టున పెట్టారు. కౌలు రైతు సాయం అతీ గతీ లేకుండాపోయింది. రుణమాఫీ దారుణ పరిహాసమైంది. అరకొరగా అమలుచేసి చేతులు దులిపేసుకున్నారు. రూ.2 లక్షల లోపు రుణాలమాఫీ పూర్తి చేసినట్టు సర్కారు గొప్పలు చెప్పుకున్నది. కానీ, ఆచరణలో 40 శాతం మందికి కూడా పూర్తికాకపోవడం కఠోర సత్యం. మరోవైపు భరోసా నయవంచనైంది. పెంచుతామన్న పంట



సాయం పెంచకపోగా వానకాలం మొత్తానికే ఎగ్గొట్టడంతో రైతు రుణభారం కింద నలిగిపో యాడు. పగలతో, సెగలతో ప్రాజెక్టులను పండబెడితే కళకళలాడిన నీటవనరులు వెలవెలబోతున్నాయి. చెరువులు వట్టిపోయి భూగర్భ జలాలు లోలోతుల్లోకి జారిపోతున్నాయి. వీటన్నిటి ఫలితంగా నీళ్లందక పొలాల గొంతులెండుతున్నాయి. పంట కొనుగోళ్లలో జాప్యంతో పరిస్థితి మరింతగా దిగజారింది. బోనస్ బోగస్ అయ్యిం ది. అప్పులు కుప్పలయ్యాయి. ఆశలు అడుగంటాయి. సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న రైతు మరణమే మేలనుకునే స్థితికి చేరుకు న్నాడు. ఇందుకు బాధ్యత వహించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన సర్కారు మాత్రం మొద్దు నిద్ర నటిస్తూ బుకాయింపులతో, అసత్య ప్రచారాలతో కాలయాపన చేస్తుండటం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. ఆరుగాలం అరిగోస పడి పంటలు పండించి, ఆకలి తీర్చే రైతుల ఓపిక నశిస్తున్నది. అయితే ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావనేది రైతులు గుర్తెరగాలి. మాటతప్పిన సర్కారు మెడలు వంచాలి. హామీలను సాధించాలి. ఆత్మ బలిదానాలతో హృదయం లేని సర్కారు లో పరివర్తన వస్తుందని ఆశించలేం. హామీల అమలుకు అడుగడుగునా నిలదీయడం, పోరాటం చేయడం ఒక్కటే మార్గం.

# వాయిదా వద్దు



కోటి విద్యలూ కూటి కోసమే అని సామెత. కానీ, ఆధునిక వృత్తి నిపుణులు భోజనాన్ని దాటవేయడం సాధారణంగా జరుగుతుండే విషయమే. కొన్నిరోజుల వరకు ఇది అంతగా ఇబ్బంది అనిపించకపోవచ్చు. కానీ, పొట్టను పస్తులు ఉంచడం దీర్ఘకాలంలో గుండెకు హాని కలిగిస్తుందని అంటున్నారు వైద్యులు. భోజనం వాయిదా వేస్తే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గిపోతాయి. దీంతో ఇరిటేషన్, ఆందోళన, ఒత్తిడి లాంటి అనుభూతులు కలుగుతాయి. దీర్ఘకాలిక ఒత్తిడి అధిక రక్తపోటుకు దారితీస్తుంది. ఇది గుండెజబ్బులకు ప్రధాన కారణంగా నిలుస్తుంది. అంతేకాదు సమయానికి తినకపోవడం మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. భోజనం వాయిదా వేయడం వల్ల తర్వాత పరిమితికి మించి తినేస్తాం. అంతేకాదు అనారోగ్యకరమైన క్యాలరీలు ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు తీసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది బరువు పెరగడానికి, అధిక కొలెస్ట్రాల్‌కు, రక్తనాళాల్లో అవరోధాలకు కారణమవుతుంది. ఇవన్నీ కూడా గుండెజబ్బుల ముప్పును పెంచుతాయి.
వేళకు తినకపోతే శరీరంలో జీవక్రియలు నెమ్మదిస్తాయి. ఇది శరీరంలో కొవ్వు పేరుకోవడానికి దారితీస్తుంది. దీంతో ఊబకాయం ముప్పు, తద్వారా గుండె మీద ఒత్తిడీ పెరుగుతాయి. భోజనం మానేస్తే శరీరంలో రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయిలు అకస్మాత్తుగా పడిపోతాయి. దీంతో తల తిరిగినట్టుగా, అశక్తతగా అనిపిస్తుంది. ఇది గుండె రక్తనాళాల ఆరోగ్యానికి చేటు చేస్తుంది. రక్తపోటు లయ తప్పుతుంది. దీర్ఘకాలంపాటు తిండిని వాయిదా వేయటం వల్ల శరీరంలో ఇన్సులిన్ క్రమబద్ధంగా ఉత్పత్తి కాదు. దీంతో టైప్ 2 డయాబెటిస్ అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది. ఇది కూడా గుండె ఆరోగ్యానికి సమస్యగా మారుతుంది.
ఆచరణీయ మార్గాలు: పనిచేసే రోజుల్లో ఆహారానికి ఓ ప్రణాళిక వేసుకోవాలి. ముందే సిద్ధం చేసుకుంటే సమయానికి తింటారు. పండ్లు, గింజలు, యోగర్ట్ లాంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఆహారంలో తేలిగ్గా అరిగే ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, హోల్ గ్రెయిన్స్, కూరగాయలు తగినపాళ్లలో ఉండాలి. దీనివల్ల శరీరానికి శక్తి స్థిరంగా లభిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఇప్పుడు అందరి దగ్గర స్మార్ట్‌ఫోన్లు, వాచ్‌లు ఉంటున్నాయి. అలారం పెట్టుకుంటే తిండిని వాయిదా వేసే అవకాశమే ఉండదు. కొన్నిసార్లు దప్పికగా అనిపించడాన్ని కూడా ఆకలిగా పొరబడే అవకాశం ఉంది. కాబట్టి రోజంతా తగినన్ని నీళ్లు తాగుతూ ఉండాలి. దీంతో అనవసరంగా ఏదో ఒకటి తినే పరిస్థితి తలెత్తదు. మీ పనికి కాసేపు విరామం ఇచ్చి సమయానికి తినేయాలి. ఇలా చేస్తే జీర్ణవ్యవస్థ పనితీరు కూడా సక్రమంగా ఉంటుంది. అందువల్ల%ొ% తిండిని వాయిదా వేసుకోవడాన్ని సమయాన్ని ఆదా చేసుకుంటున్నట్టుగా భావించకండి. ఎంత పనిలో ఉన్నప్పటికీ ఆహారం విషయంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకుంటే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కెరీర్‌లో విజయాలూ సొంతం చేసుకోవచ్చు.

# జనవరి 26 నుంచి రైతు భరోసా



హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : రైతు భరోసా పథకాన్ని జనవరి 26 నుంచి అమలు చేయబోతోంది తెలంగాణ ప్రభుత్వం. ఈ పథకంలో భాగంగా ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం అందించనున్నట్లు ప్రకటించింది. అయితే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధం లేదని ఆరోపిస్తున్నారు రైతు సంఘాల నేతలు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలలో ఒకటిగా ఈ పథకాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, రైతు డిక్లరేషన్‌లోనూ చెప్పింది. అయితే, దఫదఫాలుగా సాయాన్ని పెంచుమతాని చెబుతోంది ప్రభుత్వం. జనవరి 26 నుంచి అమలు చేస్తామని చెప్పిన రైతు భరోసా పథకం కింద రూ. 12 వేలు ఇస్తామని తాజాగా ప్రకటించింది ప్రభుత్వం.
హామీకీ, ఆచరణకు పొంతన లేకపోవడంపై అభ్యంతరం చెబుతోంది తెలంగాణ రైతు సంఘం. "అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతాంగం ఓట్లు ఆకర్షించేందుకు మేనిఫెస్టోలో రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబుతో కమిటీ ఏర్పడింది. కమిటీ సిఫార్సుల ఆధారంగా మార్గదర్శకాలు జారీ చేసినట్లుగా ప్రభుత్వం చెబుతోంది. సాగు యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వరాదని మంత్రివర్గ ఉపసంఘం చేసిన కీలక సిఫార్సు. దానికి తగ్గట్టుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో గ్రామాల వారీగా సాగు యోగ్యం కాని భూములపై సర్వే చేసి, దాని ఆధారంగా 26వ తేదీ నుంచి రైతు భరోసా సాయం అందించనున్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ని ఘనంగా సన్మానించిన నేతాజీ వాకర్స్ టీమ్





మణుగూరు, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : నూతనంగా ఎన్నికైన మణుగూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్, అందరికి సుపరిచితుడు, స్నేహశీలి,మృదు స్వభావితుడైన పిండిగ వెంకట్ ను నేతాజీ వాకర్స్ టీమ్ (మణుగూరు ఏరియా స్టోర్ గ్రౌండ్) నేతాజీ సుభాష్ చంద్రబోస్ గ్రౌండ్లో మంగళవారం ఉదయం ఘనంగా సన్మానించారు. ముందుగా నేతాజీ వాకర్స్ టీమ్ తో ముద్రించిన మెమోంటో, పూల బుక్కె అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిండిగ వెంకట్ మాట్లాడుతూ... నేతాజీ గ్రౌండ్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు వివిధ సమస్యలు స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. అందుకు నేతాజీ వాకర్స్ టీమ్ వారు ఆయనను అభినందించి నూతనంగా ఏర్పడిన మణుగూరు ప్రెస్ క్లబ్ కమిటికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్. విజయ్ భాస్కరరెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, రావులపల్లి రామమూర్తి, వద్దాణం రమేష్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, దొబ్బల శేషగిరిరావు, శ్యామల రామిరెడ్డి, కటకం సతీష్, శంకర్ రెడ్డి, దేశబోయిన తిరుపతిరావు, ప్రసాద్, కనుకు రమేష్, భద్రు, బాంబే వెంకటేశ్వరరావు, గోల్డ్ షాప్ శంకర్, కురిమెల్ల శ్రీనివాసరావు, వాగబోయిన నాగేశ్వరరావు, కొండి శ్యామ్ కుమార్, రామిరెడ్డి, వినీల్, వంగా సంతోష్, ఆర్ సుమన్, ఏ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ పార్టితోనే సాధ్యం



నర్సంపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ పాలనలోనే పేదప్రజలకు సంక్షేమ పతకాలు అందుతాయని స్థానిక శాశనసభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట,నెక్కొండ దుగ్గొండి మండలాల్లో గ్రామసభలు జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దుగ్గొండి మండలం చాపలబండ గ్రామంలో జరిగినటువంటి గ్రామసభకు ముఖ్య అతిధిగా హాజరైనటువంటి ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాల పై వివరరించారు. పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకునేలా ప్రజలందరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని అన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ కార్యకర్తలు అధికారులతో కలిసి కాంగ్రెస్ కుటుంబ సభ్యులు నేటి నుంచి మొదలయ్యే గ్రామ సభలో భాగస్వాములు కావాలని పిలుపునిచరు. 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోస,రైతు భరోస,నూతన రేషన్ కార్డుల పంపిణీ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరు లేని పథకాలకు అర్హులైన లబ్ధిదారులను దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పథకాల కోసం దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వెల్లడించారు. నేటి నుంచి ఈ నెల 26 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్న తరుణంలో సభలలో సైతం దరఖాస్తు చేసుకోవచ్చని లబ్ధిదారులకు సూచించారు. దీనిపై అర్హులు ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సాగుభూములకే రైతు భరోసా ఇవ్వడం,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మొదటి విడతలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతను ఇవ్వడం,భూమి లేకుండా ఉపాధి హామీ పనిచేసుకునే నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇవ్వడం,గత పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు ఇవ్వడం లాంటి పథకాలు ప్రవేశ పెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని కొనియాడారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. పేదలకు సంక్షేమం కోసం అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన గ్రామ సభ లో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్..

కామారెడ్డి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : : లింగంపేట మండలంలో ముంబుజిపేట్ తండా గ్రామం లో ప్రజాపాలన గ్రామ సభ లో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ ఎమ్ పి ఓ, గ్రామ సెక్రెటరీ ఎ ఇ ఓ, గారు కాంగ్రెస్ పార్టీ లింగంపేట్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దసరత్ నాయక్ లింగంపేట్ మండల్ యూత్ మాజీ అధ్యక్షుడు మధుర గోవింద్ గ్రామ అధ్యక్షుడు సభావత్ రవి దేవి సింగ్ బాణోత్ సురేష్ గూగుల్లో సురేష్ విష్ణువర్ధన్ గులాబ్ సింగ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదవారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తాం

## ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మనోహర్ వెల్లడి



పెగడపల్లి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 21 : అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లను, రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా మంజూరు చేస్తామని పెగడపల్లి ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మనోహర్ వెల్లడించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని శాలపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన ప్రత్యేక గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలో భాగమైనటువంటి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకములకు అర్హులైన లబ్ధిదారుల యొక్క వివరములను గ్రామ సభలో గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక అధికారి చదివి వినిపించారు. జాబితాలో పేరు లేని వారి నుండి కొత్తగా దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని, వీరిపైన ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పెగడపల్లి మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి ఎస్ఎల్ మనోహర్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. తిరుపతి, అంగన్వాడి వర్కర్లు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యదార్థవాది తెలుగు దినపత్రిక
బుధవారం 22-01- 2025

# నేడు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు వర్ధంతి



**( పెండ్యాల రామ్ కుమార్, మంథని ):** అక్కినేని నాగేశ్వరరావు తెలుగు నటుడు, నిర్మాత. వరి చేలలో నుండి, నాటకరంగం ద్వారా కళారంగం లోకి వచ్చిన వ్యక్తి. తెలుగు సినిమా తొలినాళ్ళ అగ్రనాయకులలో ఒకడు. నాటకాలలో స్త్రీ పాత్రల ద్వారా ప్రాముఖ్యత పొందాడు. అతడు నాస్తికుడు. ప్రముఖ చిత్రనిర్మాత ఘంటసాల బలరామయ్య విజయవాడ రైల్వే స్టేషన్లో అక్కినేనిని చూసాడు. ఆ తరువాత సినిమాలకు పరిచయం చేసాడు. ధర్మపత్ని సినిమాతో అతడి సినీజీవితానికి తెరలేచింది. అప్పటినుండి రకరకాల తెలుగు, తమిళ సినిమాలలో 75సంవత్సరాల పైగా నటించాడు. ఎన్. టి. ఆర్ తో పాటు తెలుగు సినిమాకి మూల స్తంభంగా గుర్తించబడ్డాడు. మూడు ఫిల్మ్ ఫేర్ తెలుగు అత్యుత్తమ నటుడు పురస్కారాలు అందుకున్నాడు. భారతీయ సినిరంగంలో చేసిన కృషికి దేశంలో పౌరులకిచ్చే రెండవ పెద్ద పురస్కారమైన పద్మ విభూషణ్తో పాటు భారత సినీరంగంలో జీవిత సాఫల్య పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందాడు. అక్కినేని నాగేశ్వరరావు కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో 1924 సెప్టెంబర్ 20 న అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. చిన్ననాడే నాటకరంగం వైపు ఆకర్షితుడై అనేక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించాడు. అక్కినేనితో అన్నపూర్ణ వివాహం 1949 ఫిబ్రవరి 18న జరిగింది. ఆమె పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో 1933 ఆగస్టు 14న జన్మించింది. వారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు – అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించాడు.

అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశాడు. అక్కినేని నాగేశ్వరరావు 91 సంవత్సరాల వయసులో 2014, జనవరి 22 న మరణించాడు. అర్థరాత్రి దాటాక ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు 2.45 గంటల సమయంలో బంజారాహిల్స్ లోని కేర్ ఆసుపత్రి తీసుకువెళ్ళారు. పదినిమిషాలకే వైద్యుల బృందంతో పరిశీలించగా మృతిచెందారని నిర్ధారణ అయింది.

# వెంకటేశ్ తో 'చంటి' చేయలేకపోవడానికి కారణం ఇదే



వెంకటేశ్ – మీనా జోడీగా 'చంటి' సినిమా రూపొందింది. రవిరాజా పినిశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, ఇళయరాజా దర్శకత్వం వహించారు. 1992లో విడుదలైన ఈ సినిమా, మ్యూజికల్ హిట్ గా నిలిచింది. ఈ సినిమాతో మీనా కెరియర్ రాకెట్ వేగంతో దూసుకుపోయింది. అలాంటి ఈ సినిమా గురించి 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖుష్బూ ప్రస్తావించారు. "వెంకటేశ్ గారు ఫస్టు మూవీ 'కలియుగ పాండవులు' సినిమాతో నేను తెలుగులోకి అడుగుపెట్టాను. ఆ సినిమాకి నన్ను సిఫార్స్ చేసింది వెంకటేశ్ గారే. ఒక హిందీ సినిమాలో నన్ను చూసి సిఫార్స్ చేశారు. ఆ తరువాత నాగార్జునగారితో చేశాను. చిరంజీవి గారు .. బాలకృష్ణ గారితో చేసే అవకాశాలు వచ్చాయి. కానీ అప్పటికే నేను తమిళంలో బిజీ అయ్యాను. తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్ వెళ్లిపోవడం కూడా అందుకు ఒక కారణం" అని అన్నారు. "నిజానికి వెంకటేశ్ గారితో కలిసి 'చంటి' సినిమా కూడా నేనే చేయాలి. అయితే డేట్స్ కుదరలేదు. నేను 'చంటి' చేయాలనుకుంటే రెండు తమిళ సినిమాలు వదులుకోవాలి. ఒక సినిమాలో హీరో రజనీకాంత్ అయితే, మరో సినిమాలో హీరో కమల్ గారు. అందువలన ఆ సినిమాలు వదులుకోలేక పోయాను. అందు వలన నేను 'చంటి' సినిమాను చేయలేకపోయాను" అని అన్నారు.

# మద్యం మత్తులో జైలర్ విలన్ వినాయకన్ వీరంగం..



రజినీకాంత్ నటించిన జైలర్ సినిమాలో విలన్‌గా నటించిన ఇండియావైడ్‌గా సూపర్ పాపులారిటీ తెచ్చుకున్నాడు మలయాళ నటుడు వినాయకన్ . ఈ క్రేజీ యాక్టర్ దురుసు ప్రవర్తనతో వార్తల్లో నిలిచాడు. మద్యం మత్తులో పొరుగింటి వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో ఊగిపోతున్న వినాయకన్ తన ఇంటి బాల్కనీపై లుంగీ కట్టుకుంటూ.. అరుస్తూ పొరుగింటి వారిని అసభ్యంగా దూషించా డు.ఈ వీడియో నెట్టింట వైరల్ అవగా.. వినాయకన్ ప్రవర్తన పట్ల నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెటిజన్ల రియాక్షన్ నేపథ్యంలో వినాయకన్ ఫేస్‌బుక్‌లో క్షమాపణ కోరుతూ సందేశాన్ని పోస్ట్ చేశాడు. ఒక సినిమా నటుడిగా.. ఒక వ్యక్తిగా కూడా చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొన్ని సార్లు సమస్యలను ఎదుర్కోలేను. నా నుంచి వచ్చిన ప్రతికూల చర్యలన్నింటికి బాధ్యత వహిస్తూ.. సాధారణ ప్రజలను నేను క్షమాపణలు కోరుతున్నా. చర్చలు కొనసాగనివ్వండి.. అవ్వండి అంటూ విజ్ఞప్తి చేశాడు వినాయకన్. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు. వినాయకన్ గతంలో కూడా గోవాలో ఓ వ్యాపారితో గొడవ పెట్టుకున్నాడు.

# సినిమా



# ఓవర్సీస్‌లోనూ తగ్గేదేలే..



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. ఐశ్వర్యారాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ వసూళ్లను రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ మూవీ మూడు రోజుల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల మార్క్‌ను అధిగమించిన విషయం తెలిసిందే.తాజాగా మరో అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి.. వెంకీ కెరీర్ బెస్ట్ కలెక్షన్లుగా అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. అంతేకాదు అనిల్ రావిపూడి, వెంకటేశ్, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ హ్యాట్రిక్ కాంబోలో విడుదలై.. నార్త్ అమెరికా–2.3 మిలియన్ డాలర్లు (రూ.19 కోట్లకుపైగా) రాబట్టి.. యూఎస్ఏలో ఆల్‌టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన సినిమాగా సంక్రాంతికి వస్తున్నాం నిలిచింది. మొత్తానికి ప్రేక్షకులు, అభిమానులు తెలుగు రాష్ట్రాల్లోనేకాదు ఓవర్సీస్‌లో కూడా సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచి వెంకీ టీంకు ఎప్పటికీ గుర్తుండిపోయే బహుమతినిచ్చారు . ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.

# ప్రేమలు.. సీక్వెల్‌పై అంచనాలు



ప్రస్తుతం అందరి నోటా వినిపిస్తోన్న పేరు "ప్రేమలు." చిన్న బడ్జెట్‌తో మలయాళంలో విడుదలై వంద కోట్ల వసూళ్లతో సంచలనంగా మారిన ఈ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ, ఇప్పుడు తెలుగులోనూ ప్రభంజనం సృష్టిస్తోంది. హైదరాబాద్ నేపథ్యంలో నడిచే ఈ అందమైన ప్రేమకథ, తెలుగు యువతకు తెగ దగ్గరైంది. ఇటీవలి కాలంలో మలయాళ సినిమాలు తెలుగులో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఓటీటీలో విడుదలైన మలయాళ చిత్రాలు కూడా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన "ప్రేమలు" సినిమా, అందమైన కథతో, మోహనమైన పాటలతో, ఆకట్టుకునే కామెడీతో ఘనవిజయం సాధించింది. క్రిష్ ఎడీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో నస్లెన్, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రముఖ నటుడు ఫహద్ ఫాజిల్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. సినిమా విడుదల తర్వాత మమితా బైజు పేరు గూగుల్‌లో ట్రెండింగ్ అయిపోయింది. "ప్రేమలు బ్యూటీ" అంటూ అభిమానులు ఆమెను ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇప్పుడు "ప్రేమలు" చిత్రానికి సీక్వెల్ తెరకెక్కిస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల దీనిపై క్లారిటీ రావడంతో అభిమానులలో ఉత్సాహం నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, జూన్‌లో షూటింగ్ ప్రారంభించి, డిసెంబర్‌లో సినిమా విడుదల చేయాలని చిత్ర బృందం యోచిస్తోంది. అభిమానులను ఆసక్తిగా ఉంచుతున్న విషయం మాత్రం, సీక్వెల్‌లోనూ నస్లెన్, మమితా బైజు జంటగా కనిపిస్తారా అనే ప్రశ్న. కొత్త పాత్రలతో పాటు, మరిన్ని భావోద్వేగాలు, ఎమోషనల్ మోమెంట్స్ ఉంటాయని చిత్రబృందం సూచనలు ఇస్తోంది."ప్రేమలు 2? చిత్రంపై ఉన్న అంచనాలు, అభిమానుల ఆదరణ చూసి ఈ సినిమా మళ్లీ సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని చెప్పడం తప్పు కాదు. మొత్తానికి, తెలుగు ప్రేక్షకులకు మళ్లీ పచ్చగుచ్చే ప్రేమకథను అందించబోతున్న "ప్రేమలు 2" కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో నాగచైతన్య



టాలీవుడ్ యాక్టర్ నాగచైతన్య ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సందడి చేశాడు. తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడానికి ఆర్టీవో కార్యాలయానికి వచ్చాడు. నాగచైతన్య రెన్యూవల్ కోసం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్‌ను కలిశాడు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు నాగచైతన్యను డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తెలుసుకుని రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతూను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆర్టీవో కార్యాలయానికి తరలివచ్చారు. నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాలో నటిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో %చీజ%23 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేసేందుకు రెడీ అవుతున్నారు.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022,
RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.